ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

అనంతపురం, రాప్తాడు, శింగనమల	:9985411608
తాడిపత్రి,	: 7659062646,
గుంతకల్లు, ఉరవకొండ,	: 9985411657,
కళ్యాణదుర్గం,	:9701120019,
రాయదుర్గం,	: 9000406723,

ఏసీఎమ్: 9985411154

ఉపాధ్యాయ నియామకాలపై
డీఈఓ సమీక్ష

- సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రంలో వసతుల కల్పనకు ఆదేశాలు



ఏడీలు, సిబ్బందితో సమీక్షిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం విద్య, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ నియామకాలపై జిల్లా విద్యాశాఖ వేగంగా చర్యలు చేపడుతోంది. రాష్ట్రశాఖ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాట్లపై డీఈఓ ప్రసాద్‌బాబు దృష్టి సారించారు. విజయవాడ నుంచి వచ్చిన ఆయన బుధవారం ఏడీలు మునీర్‌ఖాన్, శ్రీనివాసులు, సెక్షన్ సూపరింటెండెంట్ ఆదినారాయణ, డిప్యూటీ డీఈఓలు మల్లారెడ్డి, శ్రీనివాసరావుతో సమీక్షించారు. డీఎస్సీ నియామకాలకు సంబంధించి రాష్ట్ర శాఖ నుంచి వస్తున్న ఆదేశాల మేరకు ఇక్కడ ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ప్రధానంగా ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల వ్యవహారం చాలా కీలకమైనదని, అన్నివసతులు ఉండేలా ఎరా ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈ ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించినట్లు డీఈఓ తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో అభ్యర్థులతో పాటు కుటుంబ సభ్యులు వస్తారని, అవసరమైన వసతులు ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని డీఈఓ ఆదేశించారు. ఖాళీలను మరోసారి పరిశీలించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. పరిశీలన ముగిసే వరకు విధుల్లో జాగ్రత్తగా ఉంటూ నిబంధనల మేరకు ఏడీలు, డిప్యూటీ డీఈఓలు, సెక్షన్ అధికారులు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. రాష్ట్ర శాఖ ఆదేశాలను అమలు చేయాలని, ఎక్కడ నిర్లక్ష్యం జరిగినా బాధ్యులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

కానిస్టేబుళ్ల శిక్షణకు ఏర్పాట్లు చేయండి: ఎస్పీ

అనంతపురం క్రైం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో కానిస్టేబుళ్ల శిక్షణకు ఏర్పాట్లు చేయాలని ఎస్పీ జగదీష్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్(డీటీసీ)ను బుధవారం ఆయన సందర్శించారు. ఇటీవల ఎంపికైన స్టైఫెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్ల శిక్షణ త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో పీటీసీని ఆయన పరిశీలించారు. ట్రైనింగ్ సెంటర్‌లోని పరిసరాలు, ఇతర మౌలిక సదుపాయాలు, బ్యారెక్‌లు, కిచెన్, జిమ్, క్లాస్ రూమ్స్, పరేడ్ గ్రౌండ్‌ను ఆయన పరిశీలించారు. గ్రౌండ్‌లోని రన్నింగ్ ట్రాక్, డ్రిల్ ఏరియా, ఇతర మౌలిక సదుపాయాలు అన్నీ సిద్ధం చేయాలన్నారు. శిక్షణార్థులకు ఎలాంటి లోటురాకుండా అన్ని ఏర్పాట్లు త్వరితగతిన చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీడీసీ డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్ రెడ్డి, ఆర్ఐ మధు తదితరులు పాల్గొన్నారు.



ట్రైనింగ్ సెంటర్‌లో పర్యటిస్తున్న ఎస్పీ

దళారీలే డాక్టర్లు..!

వైకల్య పునఃపరిశీలనలో ఇష్టారాజ్యం

- పైసలకొద్దీ పర్సెంటేజీ..
- ఇచ్చుకున్నోళ్లకు అధిక శాతం
- కాసులివ్వని అర్హులకు అన్యాయం
- లబోదిబోమంటున్న బాధితులు
- కళ్లు మూసుకున్న ఉన్నతాధికారులు

ఈయన పేరు లింగమయ్య. యాడికి వాసి. రెండు కాళ్లు లేవు. ఏమాత్రం నడవలేడు. మూడు చక్రాల కుర్చీకే పరిమితం. అయినా అధికారులు వైకల్య శాతం పునఃపరిశీలన చేసుకోవాలని నోటీసు పంపారు. ఆ మేరకు వెళ్లిన లింగమయ్యకు వింత అనుభవం ఎదురైంది. గతంలో 90 శాతం వైకల్యం ఉన్న లింగమయ్యకు పునఃపరిశీలనలో 80 శాతమే ఉన్నట్లు సర్టిఫికెట్ ఇచ్చారు. దీంతో ఆయనకు వచ్చే పింఛన్ సొమ్ము రూ.15వేల నుంచి రూ.6వేలకు తగ్గిపోయింది. బుధవారం యాడికి ఎంపీడీఓ కార్యాలయం వద్దకు వచ్చి కన్నీరుమున్నీరయ్యాడు. రెండుకాళ్లులేని తనలాంటి వాడికేనా ఇలా చేసేది అంటూ ఆవేదన వ్యక్తంచేశాడు. అధికారులు మరలా పునఃపరిశీలనకు పంపాలని కోరుతూ వినతిపత్రం అందజేశాడు.



యాడికి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పింఛన్ లబ్ధిదారుల వైకల్య పునఃపరిశీలనలో దళారీల హవా నడిచిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాసులిచ్చినోళ్లు అనర్హులైనా లబ్ధి చేకూర్చినట్లు తెలుస్తోంది. కాసులివ్వకపోతే అర్హులకు సైతం అన్యాయం చేసిన ఘటనలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఆర్ఎంపీలు, రాజకీయ పార్టీల నాయకులు దళారీల అవతారమెత్తి పైసలిచ్చిన వారందరికీ లబ్ధి చేకూర్చినట్లు తెలుస్తోంది. పైసలు ముట్టజెప్పినోళ్లు జస్ట్.. అలా.. వైద్యుడి గదిలోకి వెళ్లి వస్తే చాలు.. అని దళారీలు చెప్పినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. వైద్యులతో కుమ్మక్కై దందా సాగించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో నష్టపోయిన బాధితులు పదుల సంఖ్యలో తమకు న్యాయం చేయాలంటూ బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రాలు అందజేశారు.

300 మందికిపైగా..

మండలంలో 300 మందికిపైగా వైకల్య పునఃపరిశీలన చేసుకోవాల్సిందిగా ఎంపీడీఓ కార్యాలయం నుంచి లబ్ధిదారులకు నోటీసులు వెళ్లాయి. తమకు కేటాయించిన తాడిపత్రి, అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైకల్య పునఃపరిశీలనకు వెళ్లారు. అక్కడ ఏమి మతలబు జరిగిందో, ఏమోగానీ ఎంతో మంది అర్హులైన లబ్ధిదారులకు వైకల్య శాతం తగ్గిపోయింది. దీంతో అర్హులైన కొంత మంది పింఛన్ కోల్పోవాల్సి వచ్చింది. రూ.15వేలు పింఛన్ తీసుకుంటున్న మరికొంతమంది లబ్ధిదారులు రూ.6 వేలు తీసుకోవాల్సి వస్తోంది. డబ్బులతో వైకల్యశాతం వేయించుకున్న అనర్హులు మాత్రం దర్జాగా పింఛన్ పొందుతున్నారని ఆరోపణలు చేస్తున్నారు.

ఆస్పత్రుల్లో దళారుల వసూళ్లు

వైకల్య పునఃపరిశీలనను ఆసరాగా చేసుకొని కొందరు దళారుల అవతారం ఎత్తారు. యాడికిలోని చెన్నకేశవస్వామి ఆలయం వద్ద క్లినిక్ నిర్వహిస్తున్న ఆర్ఎంపీ, చిక్కేపల్లిలో నాయకుడిగా చెలామణి అవుతున్న మరో వ్యక్తి వైకల్య పునఃపరిశీలనలో డాక్టర్లతో తాము మాట్లాడతామనీ, జస్ట్ డాక్టర్ గదిలోకి వెళ్లి వస్తే చాలు అనీ, గతంలో ఉన్న వైకల్య పర్సంటేజీ వచ్చేలా చేస్తామంటూ డబ్బులు లాగారు. పునఃపరిశీలనకు వెళ్లిన ఒక్కో లబ్ధిదారుడి నుంచి రూ.25వేల నుంచి రూ.30వేల వరకు దళారులు వసూలు చేసినట్లు చర్చించుకుంటున్నారు. మామూలు ముట్టజెప్పని వారికి మాత్రం పింఛన్ కోల్పోయేలా వైకల్యశాతం తగ్గించేటట్లు చేశారని పెద్దఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు తగు చర్యలు చేపట్టి అర్హులైన వారికి న్యాయం చేయాలని కోరుతున్నారు.



ఎంపీడీఓ కార్యాలయంలో అర్జీలు అందజేస్తున్న బాధితులు

వీటిని ఏమంటారు?

- చిక్కేపల్లికి చెందిన ఒక వ్యక్తి ఎటువంటి అంగవైకల్యం లేకపోయినా దివ్యాంగ సర్టిఫికెట్‌తో పింఛన్ పొందుతున్నాడు. పునఃపరిశీలనకు వెళ్లిన సమయంలో అక్కడ దళారీకి రూ.30వేలు ముట్టజెప్పి, మరలా వైకల్య సర్టిఫికెట్ వచ్చేలా చేసుకున్నాడు. దీంతో అతడి పింఛన్ యథాతథంగా వస్తోంది.
- యాడికికి చెందిన మరో వ్యక్తి కేవలం కాలు విరిగిందని సాకు చూపుతూ వైకల్య సర్టిఫికెట్‌తో పింఛన్ పొందాడు. అతడు కూడా వైకల్యం లేకుండా పరిశీలనకు వెళ్లిన సమయంలో దళారులకు ముడుపులు అప్పజెప్పడంతో సర్టిఫికెట్ యథాతథంగా పొందాడు.
- యాడికికి చెందిన మరో వ్యక్తి తనకు చెవుడు ఉన్నట్లు వైకల్య సర్టిఫికెట్ పొంది పింఛన్ తీసుకుంటున్నాడు. ఇతడి వైకల్యం కూడా పరిశీలనకు పంపిన దళారులకు రూ.25 వేలు ముట్టజెప్పి సర్టిఫికెట్ పునరుద్ధరించుకున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇలా అనర్హులు ఎంతోమంది పింఛన్ పొందుతున్నారు. ఇలాంటి వారిపై చర్యలు చేపట్టి అర్హులకు అన్యాయం జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

డీఆర్‌డీఏ పీడీకి నివేదిస్తాం



సుమారు 40మంది లబ్ధిదారులు వైకల్యపునఃపరిశీలనలో తమకు అన్యాయం జరిగిందని వినతిపత్రాలు అందజేశారు. వారి అభ్యర్థన మేరకు వైకల్య పునఃపరిశీలనకు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరుతూ డీఆర్‌డీఏ పీడీకి నివేదిక పంపిస్తాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

-వీరరాజు, ఎంపీడీఓ, యాడికి

రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్
ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం చంద్రబాబు

జేఎన్‌టీయూలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే పరిటాల సునీత





జేఎన్‌టీయూలో ఏర్పాటు చేసిన ఇన్నోవేషన్ సెంటర్, వర్చువల్‌గా సీఎం ప్రసంగం

7

పసివాడిని మింగిన పాలు



వేడి పాలు ముఖం మీద పడటంతో గుత్తి పట్టణానికి చెందిన శర్విల్ రెడ్డి అనే చిన్నారి ప్రాణాలు కోల్పోయాడు.

(వివరాలు మెయిన్‌లో)

డిష్యుం.. డిష్యుం..!

క్లాక్‌టవర్ వద్ద కానిస్టేబుల్, టీడీపీ లీడర్ ఫైట్



గొడవతో భారీగా గుమికూడిన జనాలు

అనంతపురం క్రైం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నగర నడిబొడ్డున ఓ టీడీపీ నాయకుడు, ఏఆర్ కానిస్టేబుల్ పరస్పరం దాడి చేసుకున్నారు. క్లాక్ టవర్ సమీపంలో బుధవారం రాత్రి రోడ్డుపైనే కొట్టుకున్నారు. స్థానికులు తెలిపిన మేరకు, కృష్ణ కళామందిర్ సమీపంలో కానిస్టేబుల్ ఒకరు తన బైకును పార్క్ చేశారు. కురుగుంటకు చెందిన టీడీపీ నాయకుడు, మరికొందరు కారులో అక్కడికి వచ్చారు. పార్కింగ్ విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. పరిస్థితి చేయిదాటి దాడి చేసుకునే వరకూ వెళ్లింది. నడిరోడ్డుపై కొట్టుకోవడంతో ఆ ప్రాంతంలో భారీగా జనం పోగయ్యారు. ఇద్దరినీ విడిపించారు. ఈ వ్యవహారం తమ దృష్టికి రాలేదని టూటౌన్ పోలీసు అధికారులు అన్నారు.

తత్కాల్ దందా..!

- టిక్కెట్లలో దళారుల హవా
- దోచుకుంటున్న ఆన్‌లైన్ సెంటర్లు
- కొరవడిన ఆర్పీఎఫ్ నిఘా





స్టేషన్‌లో తత్కాల్ టిక్కెట్ల కోసం వేచివున్న జనం, వరుసలో ఉంచిన దరఖాస్తులు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రైల్వే టిక్కెట్లలో దళారుల దందా తీవ్రస్థాయికి చేరింది. అడ్డగోలుగా సొంతం చేసుకుంటూ ప్రయాణికులకు నిరాశ మిగులుస్తున్నారు. ప్రధాన రైల్వేస్టేషన్లు కాకుండా ఇతర చిన్న చిన్న వాటికి చేరుకుని, టిక్కెట్లు తీసుకుంటున్నారు. ఆన్‌లైన్ సెంటర్లలో సైతం బోగస్ అడ్మిన్ల పేరుతో తత్కాల్ టిక్కెట్ల దందాకు పాల్పడుతున్నారన్న విమర్శలున్నాయి. అనంతపురం రైల్వే స్టేషన్‌లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విపరీతమైన రద్దీ ఉంటుంది. అంత రద్దీలో సామన్య ప్రయాణికులు గంటల సేపు క్యూలో నిలబడి ఆఖరుకు టిక్కెట్టు దొరక్క వనుదిరుగుతున్నారు. దీంతో దళారులను ఆశ్రయిస్తున్నారు. వారు జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో టిక్కెట్ దొరకడం కష్టమని సమీపంలోని చిన్న స్టేషన్లు కల్లూరు, ధర్మవరం తదితర ప్రాంతాల్లో తత్కాల్ సమయానికి వెళ్లి దందాకు పాల్పడుతున్నారన్న విమర్శలున్నాయి. అంతా తెలిసినా ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. తనిఖీలు అటకెక్కించారన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో దళారులు మరింత రెచ్చిపోతున్నారు. దళారులకు రైల్వే పోలీసులు, ఉన్నతాధికారులతో సంబంధాలు ఉండటంతో దందా యథేచ్ఛగా సాగుతోందన్న ఆరోపణలు లేకపోలేదు.

వరుస సెలవులొస్తే మరింత డిమాండ్

రిజర్వేషన్ చేయించుకున్నా.. ఒక్కోసారి చివరి నిముషంలో ప్రయాణం రద్దయితే టిక్కెట్ క్యాన్సిల్ చేయించుకున్నందుకు భారీగా నష్టపోవాల్సి ఉంటుంది. దీంతో చాలామంది తత్కాల్ టిక్కెట్ల కోసం దళారులను ఆశ్రయిస్తున్నారు. ప్రయాణానికి ముందురోజు సంప్రదిస్తే చాలు టిక్కెట్ చేతికొస్తుంది. సామాన్యులకు తత్కాల్ ఇబ్బంది అయినా.. దళారుల నుంచి పొందే వారికి ఇదో మంచి మార్గంగా భావిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. గత వారంలో శుక్ర, శనివారంతో పాటు ఆదివారం మూడు రోజులు వరుస సెలవులు రావడంతో తత్కాల్ టిక్కెట్లలో విపరీతమైన దందా సాగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈనెల 27న బుధవారం వినాయకచవితి కావడంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు గురు, శుక్రవారాలు సెలవు పెట్టుకుంటే ఐదు రోజులపాటు సొంత ఊర్లలో గడిపే అవకాశం దక్కుతుంది. ఈ నేపథ్యంలో తత్కాల్ టిక్కెట్ కోసం విపరీతమైన డిమాండ్ ఏర్పడిందని సమాచారం. ధర ఎంతయినా పర్వాలేదు టిక్కెట్ దొరికితే చాలని అడుగుతున్నట్లు ఆన్‌లైన్ సెంటర్ల వద్ద గుసగుసలు వినిపిస్తున్నాయి. సెప్టెంబరులో దసరా పండుగ నేపథ్యంలో సెలవులకు విద్యార్థులు సొంత ఊర్లకు రానున్నారు. విజయవాడ, గుడివాడ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు సొంత ఊర్లకు రానున్నారు. ఈ మార్గంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా రైళ్లు లేకపోవడం ఇబ్బందికరంగా మారింది. దీంతో అందుబాటులో ఉన్న రైళ్లకు టిక్కెట్ దొరకడం మహాకష్టం. ఈ రైళ్లలో ప్రతినెలా, ప్రతి వారం విద్యార్థులను చూసి రావడానికి వెళ్లేవారు చాలామంది ఉన్నారు. అలాంటి వారికి వల వేసి పట్టుకుని, ఆన్‌లైన్ సెంటర్ల నిర్వాహకులు తత్కాల్ టిక్కెట్లు దొరకబుచ్చుకుని ఇస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. దళారులు అడిగినంత ఇచ్చి జేబులకు చిల్లులు పెట్టుకుంటున్నారని తెలుస్తోంది. అనంత రైల్వే స్టేషన్‌లో అన్ని హంగులతో నూతన భవనాలు నిర్మించినా తత్కాల్ సమయంలో మరో కౌంటర్ ఓపెన్ చేయకపోవడం శోచనీయం. సిబ్బంది కొరతను రైల్వే అధికారులు సాకుగా చూపుతున్నారు.

మూడు రోజులుగా తిరుగుతున్నా..: సుభాన్, ప్రయాణికుడు



అనంతపురం నుంచి వ్యక్తిగత పనిమీద ముంబై వెళ్లాలి. తత్కాల్ టిక్కెట్ కోసం మూడు రోజులుగా తిరుగుతున్నా. అయినా దొరకడం లేదు. గంట సమయం ఇస్తున్నా.. పది నిమిషాల్లోనే టిక్కెట్లు అయిపోతున్నాయి. చాలా ఇబ్బందిగా ఉంది. టిక్కెట్ దొరుకుతుందో.. లేదో..?

సమయానికి దొరకడం కష్టమే: దుర్గప్ప, ప్రయాణికుడు



తత్కాల్ టిక్కెట్ కోసం స్టేషన్‌కు వచ్చి లైన్‌లో నిలబడుతున్నానే తప్ప.. దొరకడం కష్టమవుతోంది. అనంతపురం నుంచి కాచిగూడ వెళ్లడానికి తత్కాల్ టిక్కెట్ కోసం వచ్చా. దొరుకుతుందో.. లేదో..?

సమస్య తలెత్తకుండా చూస్తాం..: సుధాకర్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్

తత్కాట్ల టిక్కెట్ల విషయంలో ఆన్‌లైన్ సెంటర్లపై నిఘా పెడతాం. నిబంధనలకు విరుద్ధంగా టిక్కెట్లు తీసుకుంటుంటే తగిన చర్యలు చేపడతాం. అక్రమాలను అరికడతాం.

అయోమయ పరీక్షలు..!

1 నుంచి 8 తరగతుల విద్యార్థుల్లో గందరగోళం

- జవాబులు రాయలేక ఆపసోపాలు
- మూల్యాంకనం చేయలేక ఉపాధ్యాయుల అవస్థలు



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

ధర్మవరం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పరీక్షల విధానంలో విద్యాశాఖ తీసుకు వచ్చిన నూతన విధానం అయోమయంగా మారింది. ఈ నెల 11 నుంచి 14వతేదీ వరకు నిర్వహించిన ఫార్మేటివ్ అసెస్‌మెంట్(ఎఫ్ఏ) పరీక్షలలో పాఠశాల విద్యాశాఖ చేసిన ప్రయోగాలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు ఉన్నతాధికారుల అనాలోచిత నిర్ణయాలతో రూపొందించిన ప్రశ్నపత్రాలకు అనుగుణంగా జవాబులు రాయడంలో విద్యార్థులు తెల్లమొహాలు వేశారు. జవాబు పత్రాలను మూల్యాంకనం చేసే టీచర్లకు కూడా చాలా వరకు ప్రశ్నలు అర్థం కాకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు. పరీక్షలంటే రెండు తావుల తెల్లకాగితాలపై జవాబులు రాసే విధానానికి స్వస్తి పలికి బుక్‌లెట్లు ముద్రించి ఏడాది పొడవునా అన్ని పరీక్షలు అందులోనే రాసుకునేందుకు విద్యాశాఖ వీలు కల్పించింది. దీంతో టీచర్లంతా సంతోషించారు. ఏడాది పాటు విద్యార్థి సామర్థ్యం అంచనా వేయడానికి ఇది ప్రామాణికంగా నిలుస్తుందని భావించారు. ప్రశ్నపత్రాలను పూర్తిగా మార్చేయడంతో ముఖ్యంగా ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు విద్యార్థులు

(మిగతా 6లో..)

చెరువులకు మహర్దశ

- కంపచెట్ల తొలగింపు.. కాలువలకు మరమ్మతులు
- నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం

చెరువులు	మంజూరైన నిధులు
1. కాటిగానిచెరువు	రూ.2.50లక్షలు
2. గొట్లూరు చెరువు	రూ.3.00లక్షలు
3. చింతలపల్లి చెరువు	రూ.2.50లక్షలు
4. పోతుకుంట చెరువు	రూ.3.00లక్షలు
5. ధర్మవరం చెరువు	రూ.5.00లక్షలు
6. రావులచెరువు చెరువు	రూ.2.50లక్షలు
7. సీసీకొత్తకోట చెరువు	రూ.2.50లక్షలు
8. కట్టకిందపల్లిచెరువు	రూ.2.50లక్షలు
మొత్తం	రూ.23.50లక్షలు



కంపచెట్లు తొలగించిన తర్వాత గొట్లూరు చెరువు కట్ట

ధర్మవరంరూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కంపచెట్లతో నిండిపోయిన చెరువుల మరమ్మతులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో చెరువులకు మహర్దశ వస్తోందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో చెరువుల మరమ్మతులపై దృష్టి సారించకపోవడంతో కట్టలమీద విపరీతంగా కంపచెట్లు పెరిగిపోయాయి. ఆయకట్టు కాలువల్లో నీరు సజావుగా పారక రైతులు ఇబ్బందులు పడుతుండేవారు. చెరువుల వద్దకు వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చెరువుల కట్టలు, ఆయకట్టు కాలువల మరమ్మతులు, కంపచెట్ల తొలగింపునకు చర్యలు చేపట్టింది. మండలంలోని 8 చెరువులకు రూ.23.50 లక్షలు నిధులు మంజూరు చేయడంతో పనులు పూర్తిచేశారు. దీంతో చెరువులకు మహర్దశ

(మిగతా 6లో...)

ఎరువులను సద్వినియోగం చేసుకోండి: కలెక్టర్



డీసీఎంఎస్ కార్యాలయంలో ఎరువులను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

కళ్యాణదుర్గం రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని డీసీఎంఎస్ కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ పోస్ మిషన్ పనితీరు, ఎరువుల పంపిణీపై ఆరాతీశారు. ఏ రకమైన ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచారని అధికారులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులతో ఏఏ పంటలు సాగు చేస్తున్నారని ఆరా తీశారు. డీసీఎంఎస్‌లో ఎరువులను తక్కువ ధరకు సబ్సిడీతో అందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఎక్కువగా ఆధారపడాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల ఎక్కువగా ఎరువులు అవసరం ఉండదన్నారు. ఆదిశగా రైతులను ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రైతులకు సబ్సిడీ ఎరువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, ఆర్డీవో వసంత్ బాబు, అగ్రికల్చర్ జేడీ ఉమామహేశ్వరమ్మ, మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి, ఏడీఏ యల్లప్ప, డీసీఎంఎస్ షెల్స్ అధికారి విజయ్, ఏవో శ్రావణ్ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ Canara Bank

ప్రాంతీయ కార్యాలయం : అనంతపురం
రికవరీ సెక్షన్, రైల్వే స్టేషన్ దగ్గర,
శ్రీనివాసనగర్, అనంతపురం-515001.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు

టు:
1. శ్రీ కావలి శివ కృష్ణ, తండ్రి: రంగయ్య, హెచ్.నెం. 15-21, గాంధీనగర్, తాడిపత్రి, ఆంధ్రప్రదేశ్-515411.
2. శ్రీమతి కావలి మమత, భర్త: శివ కృష్ణ, హెచ్.నెం. 15-21, గాంధీనగర్, తాడిపత్రి, ఆంధ్రప్రదేశ్-515411.

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.

మా కెనరా బ్యాంక్, తాడిపత్రి బ్రాంచ్ నుండి శ్రీ కావలి శివకృష్ణ మరియు శ్రీమతి కావలి మమత గార్లు పొందిన ఋణసౌకర్యాల వివరములు:

లోన్ స్వభావం & లోన్ అకౌంట్ నెం.	లోన్ మొత్తం మరియు లోన్ తేది	ప్రస్తుత తేదీ 01.08.2025 నాటికి బకాయి మొత్తం వడ్డీతో	వడ్డీ రేటు
హౌసింగ్ లోన్ అకౌంట్ నెం. 31219340001042	రూ. 17,00,000/- తేది: 29.10.2020	రూ. 16,96,423.93/-	8.35% + పీనల్ వడ్డీ

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు / ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ సదరు ఋణాన్ని తేది 29-07-2025 న నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ) గా వర్గీకరించింది. అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా రూ. 16,96,423.93/- (అక్షరాల పదహారు లక్షల తొంభై ఆరు వేల నాలుగు వందల ఇరవై మూడు రూపాయలు మరియు తొంభై మూడు పైసలు మాత్రమే) + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఇందుమూలముగా ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కును మేము వినియోగించుకుంటాము. ఇంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధించబడుచున్నారు. సదరు చట్టం మరియు/ లేదా అమలులో ఉన్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కుకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.

SARFAESI చట్టం నందలి సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది. మా బ్రాంచ్ రికార్డులో అందుబాటులో ఉన్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిస్టర్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసు పంపించడం జరిగింది.

తనఖా / తాకట్టు వుంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి

అనంతపురం ఆర్‌డి పరిధి, తాడిపత్రి యస్‌ఆర్‌డి మరియు గన్నెవారిపల్లి పంచాయతీ ఏరియాలో భాగం మరియు తాడిపత్రి గ్రామ పొలాలు, సర్వే నెం: 773, పూర్తి విస్తీర్ణం: 6-76, నికర విస్తీర్ణం: 0-01 ¼. హద్దులు: తూర్పు: మరపురెడ్డి రాజమ్మ యొక్క భూమి, పడమర: అదే సర్వే నెం.లోని గుండా రామాంజినేయులు యొక్క ఇల్లు, ఉత్తరం: లోపలికి మరియు బయటకు వెళ్లడానికి 16 అ॥ల వెడల్పు రహదారి, దక్షిణం: మరపురెడ్డి రాజమ్మ యొక్క భూమి. కొలతలు: తూర్పు-పడమర: 10 అ॥లు 10 అంగుళాలు లేదా 3.27 మీ॥, ఉత్తరం-దక్షిణం: 49 అ॥లు మరియు 6 అంగుళాలు లేదా 15.09 మీ॥. మొత్తం: 59.58 చ॥గ॥లు.

సెర్సాయ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ ఐడి: 400050669152. టైటిల్ హోల్డర్ : శ్రీ కావలి శివకృష్ణ.

తేది: 01-08-2025, ప్రదేశం: అనంతపురం — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

ఆదర్శంగా ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్

● ఎమ్మెల్యే పరిటాల సునీత ● కందుకూరు ఎంఐజీ లేఅవుట్‌లో మౌలిక వసతుల పనులకు శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, అహుడా చైర్మన్ టీసీ వరుణ్

అనంతపురం రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌ను రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుపుతామని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండలంలోని కందుకూరు గ్రామ సమీపంలోని ఎంఐజీ లేఔట్‌లో మౌలిక వసతుల పనులకు అహుడా చైర్మన్ టీసీ వరుణ్‌తో కలిసి ఆమె బుధవారం శంకుస్థాపన చేశారు. అహుడా, పబ్లిక్ హెల్త్ శాఖ ఆధ్వర్యంలో రూ.40కోట్ల అంచనాతో పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌లో ప్లాట్లు కొన్న వారికి అద్భుత సౌకర్యాలు ఉంటాయన్నారు. మధ్యతరగతి వర్గాలకు అధునాతన సౌకర్యాలతో కూడిన ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. అహుడా ఆధ్వర్యంలో నిర్మాణాలు వేగంగా సాగుతాయన్నారు. ప్రతి ప్లాట్‌కు విద్యుత్ సౌకర్యం, తాగునీటి సరఫరా, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

తవ్వకాల్లో చరిత్ర

● మట్టిలో కలిసిపోతున్న పురాతన శిల్పసంపద
● గుప్తనిధుల కోసం ఆలయం అంతా పెకలింపు
● అధ్వానస్థితిలో పంచలింగాల ఆలయం



శిథిలావస్థకు చేరిన పంచలింగాల దేవాలయం



ఆలయ వైభవాన్ని తెలుపుతున్న శిలాశాసనం

కళ్యాణదుర్గం/కుందుర్పి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కొందరు స్వార్థపరులు చరిత్రను మట్టిలో కలిపేస్తున్నారు. దురాశతో పురాతన సంపద కోసం ఆలయాలను తవ్వేస్తున్నారు. దీంతో శతాబ్దాల చరిత్ర కలిగిన శిల్పాలు, ఘన చరిత్రకు ఆనవాలుగా మిగిలిన ఆలయాలు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. ఇందుకు కుందుర్పి మండలం మలయనూరు గ్రామంలోని పంచలింగాల ఆలయమే ఉదాహరణ. ఈ ఆలయాన్ని క్రీ.శ.1179వ సంవత్సరంలో పశ్చిమ చాళుక్యులు నిర్మించినట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. ఇక్కడ ఒకే ప్రాంగణంలో మల్లికార్జున దేవాలయం, లక్ష్మణేశ్వర దేవాలయం, చిరుగోళ్లేశ్వర దేవాలయం, మహేశ్వర దేవాలయం, సూర్య దేవర ఆలయం ఉన్నాయి. వీటిని ఒక్కరోజులోనే నిర్మించి, అందులో దేవతా మూర్తులను ప్రతిష్ఠించినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం ఈ దేవాలయాలు పూర్తిగా పాడుబడి పోయాయి. కొందరు దుండగులు గుప్త నిధుల కోసం ఆలయాలను తవ్వేశారు. ఈ క్రమంలో స్థానికుల ఫిర్యాదుపై 2024, 2025లో రెండు కేసులు నమోదయ్యాయి. గుప్తనిధుల తవ్వకాలపై 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు.



ఆలయం లోపల పెకలించిన దృశ్యం

గుప్తనిధుల ఆశతో ఆలయం ధ్వంసం

ఈ పంచలింగాల ఆలయంలో భారీగా గుప్తనిధుల ఉన్నాయన్న ఆశతో కొందరు దుండగులు రహస్యంగా ఆలయాన్ని అంతా ధ్వంసం చేశారు. లోపల ఉన్న నంది విగ్రహం, శివలింగాన్ని పూర్తిగా పగలకొట్టేశారు. ఆలయంలో ఎంతో ఘనత కలిగిన శిల్ప సంపద ఉన్నప్పటికీ గుప్తనిధుల తవ్వకాలతో ఆలయ వైభవం మరుగున పడిపోయింది. ఆలయంలో కంపచెట్లు పెరిగిపోయాయి. ఈ ఆలయ విషయాన్ని పలుమార్లు పురావస్తుశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అనంతపురం, కర్నూలు పురావస్తుశాఖ సహాయ సంచాలకురాలు డాక్టర్ రజిత ఈ ఆలయాన్ని పలుమార్లు సందర్శించినప్పటికీ అభివృద్ధిపై ఏ మాత్రం చర్యలు తీసుకోలేదు. దీంతో ఆలయం అంతా అధ్వానస్థితికి చేరుకుంది. దీంతో ఇది పేకాట, మందు బాబులకు నిలయంగా మారింది.

కాపాడుకుందాం



కుందుర్పి మండలంలోని మలయనూరులో ఐదు లింగాల దేవాలయంలో ఉన్న శిల్ప సంపద పూర్తిగా అంతరించిపోయింది. ఎంతో చరిత్ర కలిగిన ఈ దేవాలయం నేడు పూర్తిగా కనుమరుగయ్యే దుస్థితిలో ఉంది. పురావస్తు శాఖ అధికారులు ఈ ఆలయం బాగోగులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. మాన దేశ ఘనతను చాటే ఇలాంటి వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.

-నరసింహులు, గురివేపల్లి, కుందుర్పి మండలం

శిల్ప కళా సంపదకు మారుపేరు



మా గ్రామంలో ఉన్న ఐదు లింగాల దేవాలయం శిల్ప కళా సంపదకు మారుపేరు. అయితే ఈ సంపదను కాపాడటంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. ఎంతో వైభవం కలిగిన ఆలయం మా గ్రామంలో ఉండటం మాకు గర్వకారణం.

-సంజీవ, మలయనూరు, కుందుర్పి మండలం

వెలలేని ఆస్తి..!

ఓ రైతు వద్ద 1818 నాటి నాణెం

నాణేనికి తొలిపూజతో పంట సాగుచేస్తున్న రైతు నల్లప్ప



1818 కాలం నాటి అర్ధ అణా

1818 కాలం నాటి అర్ధ అణాపై ఒకవైపు సీతారామ లక్ష్మణ ప్రతిబింబం

శింగనమల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): అపురూపమైన ఆ నాణ్యం రెండు శతాబ్దాల నుంచి వంశపారంపర్యంగా పెద్ద మట్లగొంది గ్రామా నికి చెందిన రైతు నల్లప్ప కుటుంబం వద్ద ఉంటోంది. ప్రస్తుతం చెలామణీలో లేని ఆ నాణ్యంను ఆ కుటుంబం భద్రంగా కాపాడుకుంటోంది. 1818లో బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ ఆ అర్ధ అణా నాణ్యాన్ని ముద్రించినట్లు దానిపై ఉంది. ఓ వైపున ధాన్యపు కంకులు, ముద్రించిన సంవత్సరం, ఈస్ట్ ఇడియా కంపెనీ పేరు ఉండగా మరో వైపు సీతారామలక్షణ ఆంజనేయుడి బొమ్మలు ముద్రితమయ్యాయి. తాత, ముత్తాతల నుంచి వచ్చిన ఈ నాణెంను ఆ కుటుంబ సభ్యులు తమ ఇంటిలో దేవుడి మూలన ఉంచి పూజలు చేస్తున్నారు. పంటలు సాగు చేసే సమయం, నూర్పిడి సమయాల్లో దేవుడి కంటే కూడా ముందుగా ఆ నాణేన్ని పూజిస్తున్నట్లు రైతు నల్లప్ప తెలిపాడు. ఇలా చేస్తే పంట బాగా పండి ఎలాంటి ఇబ్బంది ఉండదని ఆయన పేర్కొన్నారు.

ఇంటిగ్రేటెడ్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూఏ, బ్లెకింగ్ వర్సిటీ (స్వీడన్)సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నట్లు వర్సిటీ ఫారిన్ అఫైర్స్ డైరెక్టర్ ఆచార్య సుజాత తెలిపారు. ఆమేరకు బుధవారం సీఎస్‌ఈ విభాగానికి ఒక అడ్మిషన్ జరిగినట్లు తెలిపారు. ఇంకా సీఎస్‌ఈ -02, ఈసీఈ-7 సీట్లు ఉన్నాయన్నారు. మిగిలిన సీట్లకు వీసీ సుదర్శన్‌రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య స్పాట్ రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కోర్సు అభ్యసించడం ద్వారా విదేశాల్లో ఉద్యోగం సంపాదించడానికి ఎక్కువ అవకాశాలు ఉంటాయన్నారు. కోర్సు ఫీజు ఏడాదికి రూ.1.5లక్షలు అని తెలిపారు.

రైల్వే ట్రాక్‌తో నష్టం లేకుండా చూడండి

● కేంద్ర మంత్రికి ఎంపీ అంబికా వినతి



కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ అంబికా

అనంతపురం క్రైం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గుంతకల్లు మండలంలోని దోనిముక్కల, తిమ్మాపురం, కొనకొండ్ల, జి. కొట్టాల గ్రామాల్లో ప్రతిపాదిత రైల్వే ట్రాక్ వల్ల రైతులకు నష్టం లేకుండా చూడాలని రైల్వే, జలశక్తి శాఖ సహాయమంత్రి వీరన్న సోమణ్ణను అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. దేశరాజధానిలో బుధవారం ఆయన కేంద్ర మంత్రిని కలిసి, వివిధ అంశాలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గుంతకల్లు ప్రాంతంలో ఆయా గ్రామాల ప్రజలు ఇప్పటికే జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయారని, ఇప్పుడు రైల్వేట్రాక్ వెళితే మరింత నష్టం జరుగుతుందన్నారు. రైల్వేట్రాక్ మార్పుపై పునరాలోచించి ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని కోరారు. నర్సాపురం-ధర్మవరం (17247/17248) ఎక్స్‌ప్రెస్ ట్రైన్ ప్రస్తుతం ధర్మవరం వరకూ మాత్రమే నడుస్తోందని, గుంతకల్లు వరకూ పొడిగిస్తే...అనంతపురం, గుంతకల్లు ప్రజలకు సులభ రవాణా సదుపాయం కలుగుతుందన్నారు. హైదరాబాద్(కాచిగూడ) నుంచి బెంగళూరు(యశ్వంత్‌పూర్)వెళ్లే వందేభారత్ ట్రైన్ హిందూపురంలో హాల్ట్ ఉండేలా చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఎంపీ వెంట టీడీపీ సీనియర్ నేత కేసీ హరి, సర్పంచ్ శ్రీరాములు, ఓబులేసు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా పర్యాటక శాఖాధికారి శివరామకృష్ణ

అనంతపురం టౌన్, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల కోసం 2025-26 సంవత్సరానికిగాను అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటకశాఖ అధికారి శివరామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. అభ్యర్థులు కేంద్ర, రాష్ట్ర పర్యాటకశాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కేటరింగ్ టెక్నాలజీ, అప్లైడ్ న్యూట్రిషియన్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీఎస్సీ(హెచ్- హెచ్ఏ) 3 సంవత్సరాల డిగ్రీ కోర్సుకు ఇంటర్‌లో 40శాతం పైగా మార్కులు వచ్చిన వారు అర్హులన్నారు. ఈ కోర్సులో ఫుడ్ ప్రొడక్షన్, ఫ్రంట్ ఆఫీస్, హౌస్‌కీపింగ్ నేర్పించి, ప్రముఖ ఫైవ్‌స్టార్ హోటళ్లలో ప్రాక్టికల్ ట్రైనింగ్ నాలుగు నెలలు ఇప్పిస్తామన్నారు. ఫుడ్ ప్రొడక్షన్‌లో క్రాఫ్ట్ కోర్స్, పెటిసరీ కోర్సుకు పదో తరగతి పాసైనవారు అర్హులన్నారు. ఈ కోర్సుకు ఏడాదిపాటు దేశ విదేశాల వంటకాలు నేర్పించి, ఆరు నెలలపాటు ఫైవ్‌స్టార్ హోటళ్లలో ప్రాక్టికల్ శిక్షణ ఇప్పిస్తామన్నారు. ఫుడ్ సర్టిఫికెట్, బేవరేజ్ సర్వీస్ కోర్సుకు కూడా పదోతరగతి పాసైనవారు అర్హులన్నారు. ఈ కోర్సులో ఐదు నెలలపాటు రెస్టారెంట్, బార్ సర్వీస్ నేర్పించి నెలపాటు ప్రముఖ ఫైవ్‌స్టార్ హోటళ్లలో శిక్షణ ఇప్పిస్తామన్నారు. ఈ కోర్సులకు వయోపరిమితి లేదని తెలిపారు. కోర్సులు పూర్తయిన తర్వాత రాష్ట్ర పర్యాటకశాఖలోని హోటళ్లు, ఫైవ్‌స్టార్ హోటళ్లలో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి గలవారు ఈనెల 25లోపు టీటీ.ఊటీజిర్యుఇఃౌటజ వెబ్‌సైట్ లేదా 9701343846, 9100558006 నెంబర్లను సంప్రదించవచ్చునన్నారు.

దీర్ఘకవితల పోటీలకు ఆహ్వానం

అనంతపురం టౌన్(ఆంధ్రజ్యోతి): దీర్ఘ కవితల పోటీలకు సాహితీవేత్తల నుంచి కవితలను ఆహ్వానిస్తున్నట్లు రాయలసీమ సాంస్కృతిక వేదిక సమన్వయకర్త డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. రాయలసీమ సాంస్కృతికోద్యమంలో భాగంగా ప్రతి ఏడాది సాహితీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సాహితీవేత్తలు రాయలసీమ నేపథ్యంపై రాసిన దీర్ఘ కవితలను నవంబరు 1లోపు 'డా. అప్పిరెడ్డి హరినాథరెడ్డి, డో.నెం.1-1349, ఫ్లాట్ నెం.24, షైన్ విలాస్, టాటా షోరూమ్ వద్ద, నేషనల్ హైవే, రుద్రంపేట, అనంతపురం-515002 చిరునామాకు పంపాలన్నారు. వివరాలకు 99639 17187 నెంబర్‌ను సంప్రదించవచ్చునన్నారు.

తిరుపతిలో 'అమరావతి చాంపియన్ షిప్'

● శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు

అమరావతి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో 'అమరావతి చాంపియన్ షిప్-2025' పేరుతో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. ఈ నెల 29న జరగనున్న నేషనల్ స్పోర్ట్స్ డేలో భాగంగా రాష్ట్రస్థాయి పోటీలకు తిరుపతి ఆతిథ్యమిస్తోందని బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 24, 25, 26వ తేదీల్లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రస్థాయిలో హాకీ, బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్ బాల్, ఖోఖో, కబడ్డీ, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్, ఆర్చరీ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో రెండు వేల మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల 29న విశాఖపట్నంలో జరిగే నేషనల్ స్పోర్ట్స్ డేకు సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల విజేతలకు నగదు ప్రోత్సాహకాలు, పతకాలు అందజేస్తామని రవినాయుడు స్పష్టం చేశారు.

చెరువులకు మహర్దశ



గొట్లూరు చెరువుకట్టపై ఉన్న కంపచెట్లు (ఫైల్)

(5వ పేజీ తరువాయి)

వచ్చినట్లయింది. వర్షాలు కురిసి నీరు చేరితే చెరువుల వద్దకు వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని రైతులు పేర్కొంటున్నారు.

చెరువుకట్టను చూస్తే ఆనందంగా ఉంది



మా గ్రామంలో చెరువుకట్టపై విపరీతంగా కంపచెట్లు పెరిగి చెరువులోకి కూడా వెళ్లలేకపోయేవాళ్లం. ప్రస్తుతం చెరువుకట్టపై కంపచెట్లు, ఇతర ముళ్ల కంపలు తొలగించడంతో కట్టకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశారు. దీంతో చెరువుకట్టను చూస్తే ఆనందంగా ఉంది.

-వెంకటేష్ చౌదరి, చింతలపల్లి

ఏళ్లనాటి కంపచెట్లు తొలగించారు



మా చెరువుకట్టపై ఎన్నోఏళ్ల నుంచి కంపచెట్లు పెరిగిపోయి ఉండేవి. దీంతో చెరువుకట్ట వద్దకు వెళ్లాలంటేనే భయంగా ఉండేది. చెరువు నిండినప్పుడు చూడటానికి కట్ట మీదకు వెళ్లాలంటే ఇబ్బంది పడేవాళ్లం. కూటమి ప్రభుత్వం రాగానే చెరువుకట్టపై ఉన్న కంపచెట్లు తొలగించి, కట్టకింద ఉన్న మట్టిజారి పోకుండా చర్యలు తీసుకున్నారు. -బండ్ల రామకేశవులు, గొట్లూరు

చెరువు కట్టలు, కాలువలకు మరమ్మతులు

చెరువు కట్టలు, కాలువల మరమ్మతుల కోసం ప్రభుత్వం మైనర్ ఇరిగేషన్ అపరేషన్ మెయింటెనెన్స్ కింద 8 చెరువులకు రూ23.50 లక్షలు నిధులు మంజూరు చేసింది. ఇప్పటి వరకు చింతలపల్లి, గొట్లూరు, పోతుకుంట, కట్టకిందపల్లి, సీసీకొత్తకోట చెరువు కట్టలు మీద ఉన్న కంపచెట్లు, ఆయకట్టు కాలువల్లో నీరు వెళ్లేందుకు ముళ్లకంపలు, మట్టి అడ్డులేకుండా చర్యలు చేపట్టాం. మిగిలిన చెరువుల కట్టలు, ఆయకట్టు కాలువలపై పనులు పూర్తి చేయిస్తాం.

-గురుప్రసాద్, ఏఈ, జలవనరుల శాఖ

అయోమయ పరీక్షలు..!

(5వ పేజీ తరువాయి)

జవాబులు రాయడానికి ఇబ్బంది పడ్డారు.



విద్యాశాఖ రూపొందించిన ఎఫ్ఏ-1 బుక్‌లెట్

సిలబస్‌ను కాదని..

ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లంతా సిలబస్ మేరకు పాఠాలు బోధించి అందులో నుంచే ప్రశ్నపత్రం రూపొందించేవారు. ఈనెల 11 నుంచి 14వరకు జరిగిన ఎఫ్ఏ-1 పరీక్షల్లో బోధనకు అనుగుణంగా కాకుండా.. తార్కిక, అనువర్తిత (అప్లికేషన్ మెథడ్) విధానంలో ప్రశ్నపత్రాలు రూపొందించారు. దీంతో విద్యార్థులు జవాబులు రాయలేక పోయారని టీచర్లు వ్యాఖ్యానిస్తున్నారు. జవాబు పత్రాలు మూల్యాంకనం చేసే వారికి సైతం కొన్ని ప్రశ్నలు అర్థంకాలేదు. 9,10వ తరగతి విద్యార్థులకు ఇచ్చే ప్రశ్నపత్రాలు యథావిధిగా ఉన్నాయని, ఒకటి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఇచ్చే ప్రశ్నపత్రాలతోనే తంటా వచ్చిందని మరో ఉపాధ్యాయుడు అభిప్రాయ పడ్డారు. ఒకటి, మూడు తరగతుల పిల్లలకు పెట్టిన నిబంధనలతో గందరగోళం నెలకొంది. మూల్యాంకనం చేసేందుకు టీచర్లు నానా తిప్పలు పడుతున్నారు. ఎస్‌సీఈఆర్టీ విభాగం నిర్వాకంతోనే ఎఫ్ఏ పరీక్షలు విమర్శలకు తావిచ్చిందని టీచర్లు వ్యాఖ్యానిస్తున్నారు.

బబ్లింగ్ విధానం తొలగించాలి



ప్రభుత్వం ఒకటి నుంచి పదో తరగతి వరకు నిర్వహించే ఎఫ్ఏ-1, ఎఫ్ఏ-2, ఎఫ్ఏ-3 పరీక్షలకు సబ్జెక్టుకు ఒక బుక్‌లెట్ విధానం తీసుకువచ్చింది. ఈ పద్ధతి బాగుంది. 1 నుంచి 8వ తరగతి వరకు బబ్లింగ్ విధానం పెట్టడం వల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు ఈ విధానం తెలియకపోవడంతో అయోమయానికి గురవుతున్నారు. ఈ విధానాన్ని తొలగించి పాతపద్ధతిలోనే పరీక్షలు నిర్వహించాలి.

-ఆర్.చంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీటీఎఫ్

పోటీ పరీక్షలకు ఉపయోగం



ప్రభుత్వం రాబోవు కాలంలో పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకే ఈ విధానాన్ని తీసుకువచ్చింది. అందులో భాగంగా ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు పాఠశాలలో నిర్వహించే పరీక్షలకు ఈ విధానాన్ని అమలు చేస్తోంది. ఈ విధానానికి విద్యార్థులు అలవాటు పడటానికి సమయం పడుతుంది. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

-కిష్టప్ప, డీఈఓ

ఖతర్ నుంచి తనకల్లుకు నూరుల్లా మృతదేహం

● టీడీపీ ఎన్ఆర్ఐ వింగ్ ఖర్చులతో స్వస్థలానికి..
● బతుకుదెరువుకు వెళ్లి 20 రోజుల క్రితం మృతి

తనకల్లు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండల కేంద్రానికి చెందిన నూరుల్లా(36) మృతదేహం ఖతర్ నుంచి స్వస్థలానికి బుధవారం చేరింది. బతుకుదెరువు కోసం నూరుల్లా నాలుగేళ్ల క్రితం ఖతర్ వెళ్లారు. వెళ్లింది మొదలు ఒక్కసారి కూడా స్వదేశానికి తిరిగిరాలేదు. ఖతర్‌లో డ్రైవర్‌గా పనిచేస్తూ ఇక్కడ చేసిన అప్పులను వడ్డీ సహా చెల్లించేశారు. మరో నెల రోజులు పనిచేసి, ఇంటికి కొంత డబ్బుతో వస్తానని కుటుంబ సభ్యులకు గత నెల 30న ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. కానీ ఆ మరుసటి రోజే మృతిచెందినట్లు అక్కడి నుంచి సమాచారం వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాన్ని పంపేందుకు అక్కడి యజమాని డబ్బులు ఇవ్వాలని కోరడంతో దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొన్నారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సాయం కోరారు. దీంతో ఆయన విషయాన్ని ఆయన ముఖ్యమంత్రి కార్యాలయం, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. ఖతర్‌లో ఉన్న భారతీయుల సాయం కోరారు. అలా సమస్య ఇండియన్ ఎంబసీ వరకూ వెళ్లింది. మంత్రి నారా లోకేశ్ సూచనలతో టీడీపీ ఎన్ఆర్ఐ వింగ్ నాయకులు వేమూరి రవికుమార్ స్పందించారు. నూరుల్లా మృతదేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చేందుకు అయ్యే ఖర్చులను ఎన్ఆర్ఐ వింగ్ సమకూర్చింది. అలా ఖతర్ నుంచి బెంగళూరు ఎయిర్‌పోర్టుకు, అక్కడి నుంచి అంబులెన్సులో తనకల్లుకు చేర్చారు. నూరుల్లా మృతదేహాన్ని చూడగానే భార్య తల్లి ఫరియానా, సాబాజ్, కూతుళ్లు ఆయేషా, సన్నా కౌసర్, ఇతర కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కన్నీరుమున్నీరయ్యారు. కుటుంబ సభ్యులు అంత్యక్రియలను పూర్తి చేశారు. సహకరించిన కదిరి ఎమ్మెల్యే కందికుంటకు కృతజ్ఞతలు తెలిపారు. సెంటు భూమి లేని ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బంధుమిత్రులు విన్నవించారు.



నూరుల్లా (ఫైల్)

రుణం తీరిపోయింది..

కొవిడ్‌కు కొంతకాలం ముందు జీవనోపాధి కోసం నూరుల్లా అప్పు చేసి ఐచర్ వాహనం కొనుగోలు చేశారు. ప్రభుత్వం లాక్‌డౌన్ విధించడంతో రెండేళ్లు ఎలాంటి బాడుగలు రాలేదు. దీంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. అప్పులవారి ఒత్తిళ్లు పెరిగాయి. వాటిని తీర్చడం ఇక్కడ సాధ్యం కాదని, ఖతర్ వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అక్కడికి వెళ్లాక నూరుల్లా ప్రతి నెలా డబ్బులు పంపించారు. అప్పులను వడ్డీ సహా చెల్లించమన్నాడు. ఆయన మాటను భార్య, తల్లి పాటించారు. నాలుగేళ్ల కష్టపడి అప్పులు తీర్చేశారు. ఇంకొక్క నెల పనిచేసి, చేతిలో కొంత డబ్బు తీసుకుని వస్తాను అని నూరుల్లా తన భార్యకు ఫోన్ చేసి చెప్పారు. అంతటితో రుణం తీరిపోయింది అన్నట్లు ప్రాణాలు విడిచారు. గత నెల 31న తన యజమానిని దించేసి, తిరిగి వచ్చే దారిలో బ్రిడ్జిపై వాహనాన్ని ఆపారు. అక్కడి నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారా, ప్రమాదవశాత్తూ పడ్డారా అన్న స్పష్టత లేదు.



మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు

విద్యాలయం కోసం..!

భూములు పరిశీలించిన కలెక్టర్



చెన్నంపల్లిలో గొడుగు పట్టుకుని భూమిని పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

కళ్యాణదుర్గం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జవహర్‌లాల్ నెహ్రూ నవోదయ విద్యాలయం నిర్మాణం కోసం భూమిని గుర్తించేందుకు కంబదూరు మండలం పాళ్లూరు చెన్నంపల్లిలో కలెక్టర్ వినోద్ కుమార్ పర్యటించారు. గొల్లపల్లి, చెన్నంపల్లి గ్రామాల పరిధిలో ఉన్న భూములను బుధవారం ఆయన పరిశీలించారు. వర్షం వస్తుండటంతో గొడుగు పట్టుకుని, రాత్రి పొద్దుపోయాక టార్చ్‌లైట్లు వేసుకుని భూములకు సంబంధించిన స్కెచ్‌లను పరిశీలించారు. ఈ రెండు గ్రామాల పరిధిలో ప్రభుత్వ భూమిని గుర్తించాలని అధికారులకు ఆదేశించారు. చెన్నంపల్లి పరిధిలో సర్వే నెంబర్ 169, 170లో ఉన్న 30.75 ఎకరాల భూమిని పరిశీలించారు. అనంతరం పాళ్లూరు రెవెన్యూ గ్రామ పరిధిలోని గొల్లపల్లి, చెర్లోపల్లి గ్రామాల మధ్యలో వున్న సర్వే నెంబర్ 242లో 158 ఎకరాల భూమిని కలెక్టర్ పరిశీలించారు. అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, ఆర్డీవో వసంత బాబు, డీఐ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.19వేలు

అనంతపురం రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.9వేలు, సరాసరి ధర రూ.14వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 745 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.



క్రైం కార్నర్

తల్లి మందలించిందని కుమారుడి ఆత్మహత్య

లేపాక్షి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): తల్లి మందలించిందన్న మనస్తాపంతో మండలంలోని తిలక్‌నగర్‌కు చెందిన ఆకాష్(27) మంగళవారం ఇంట్లో చీరతో పైకప్పునకు ఉరేసుకుని, మృతిచెందాడు. తల్లి భూదేవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కళ్యాణదుర్గానికి చెందిన భూదేవికి గౌరీబిదనూరులో నివాసముండే రవిచంద్రకుమార్‌తో వివాహమైంది. దంపతులు 16ఏళ్ల క్రితం విడిపోయారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండో కుమారుడు ఆకాష్, తల్లి వద్దే ఉండేవాడు. వీరు జీవనోపాధి కోసం తిలక్‌నగర్‌కు వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. ఆకాష్ కియ పరిశ్రమలో ఉద్యోగం చేస్తుండేవాడు. ఇటీవల ఉద్యోగం మానేసి జులాయిగా తిరుగుతుండేవాడు. మంగళవారం తల్లి ఏదైనా పనిచేసుకోవాలని చెప్పింది. తర్వాత గౌరీబిదనూరుకు బయల్దేరింది. రైల్వేస్టేషన్ వరకు తల్లికి తోడుగా వెళ్లాడు కూడా. అనంతరం ఆకాష్ ఇంటికెళ్లి పైకప్పునకు ఉరేసుకున్నాడు. చుట్టుపక్కలవారు గమనించి తల్లికి ఫోన్ చేయగా మంగళవారం రాత్రికి ఇంటికి చేరుకుంది. తలుపులు బద్దలుకొట్టి చూడగా అప్పటికే మృతిచెందాడు. భూదేవి ఫిర్యాదు మేరకు లేపాక్షి ఏఎస్ఐ షర్ఫుద్దీన్ కేసు నమోదు చేసుకున్నారు.

యువకుడి అదృశ్యం

అనంతపురం క్రైం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచానపల్లికి చెందిన ఓ యువకుడు హెయిర్ కటింగ్ కోసం వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లి కనిపించకుండా పోయినట్టు పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతపురం రూరల్ పోలీసులు బుధవారం తెలిపిన వివరాల మేర కు.. సత్యనారాయణ(32) రెండు రోజుల కిందట కటింగ్ తీయించుకుంటానని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తర్వాత ఇంటికి తిరిగి రాలేదు. కు టుంబికులు పలు చోట్ల వెతికినా కనిపించకపోవడంతో అతడి తండ్రి ఈశ్వర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పట్నం పూర్వపు ఎస్ఐపై కేసు నమోదు

అనంతపురం క్రైం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయి జిల్లా ముదిగుబ్బ సర్కిల్ పరిధిలోని పట్నం పోలీస్ స్టేషన్ పూర్వపు ఎస్ఐ రాజశేఖర్‌పై కేసు నమోదైంది. లైంగిక వేధింపులకు సంబంధించి బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుత్తి పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 189/2025 కింద కేసు నమోదు చేశారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం, బీఎన్ఎస్, ఐటీ చట్టాలలోని పలు సెక్షన్ల కింద కేసు కట్టారు. సమస్య పరిష్కారం కోసం పట్నం స్టేషన్‌కు వచ్చిన ఓ మహిళను ఎస్ఐ హోదాలో రాజశేఖర్ వేధించారనే ఆరోపణలు వచ్చాయి. బాధితురాలని వేధించిన అసభ్యకర వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో ఎస్పీ రత్న ఎస్ఐని తొలుత వీఆర్‌కు పంపారు. శాఖపరమైన విచారణలో వేధింపులు నిజమేనని తేలడంతో కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఆయనను సర్వీస్ నుంచి తొలగించారు. తాజాగా బాధితురాలి నుంచి ఫిర్యాదు స్వీకరించి, కేసు నమోదు చేశారు.


రాజశేఖర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మొదటే మడకశిర చెరువులకు నీరివ్వాలి

● ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

అనంతపురం క్రైం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా కాలువ ద్వారా మడకశిర నియోజకవర్గంలోని చెరువులకు మొదట నీళ్లు ఇవ్వాలని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, ఎంపీ పార్థసారథి హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులను ఆదేశించారు. అనంతపురంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఎమ్మెల్యే రాజు హంద్రీనీవా అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు ఎంపీ పార్థసారథి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరయ్యారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ ప్రతి ఏటా కృష్ణా జలాలు మడకశిర నియోజకవర్గంలోని చెరువులకు సరిగా చేరకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందుకే ఈ ఏడాది మొదటే మడకశిర చెరువులను నీటితో నింపాలన్నారు. కలెక్టర్‌తో మాట్లాడి త్వరలో ఐఏబీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని, హంద్రీనీవా జలాలు చెరువులకు అందించే అంశాలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకునేలా చూడాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఎస్ఈ స్వరూప్, డీఈఈలు, ఏఈఈలు, వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి, సింగిల్ విండో అధ్యక్షుడు, జడ్పీటీసీలు పాల్గొన్నారు.

అనంత అమ్మాయిలు అదుర్స్


ఆంధ్రా సీనియర్ మహిళా క్రికెట్ జట్టు ప్రాబబుల్స్‌కు ఆరుగురి ఎంపిక


చక్రిక దండు | హర్షిత | తేజశ్విని | నేహా | హన్సిరెడ్డి | అర్షియా

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్-23 సీనియర్ మహిళా క్రికెట్ జట్టు ప్రాబబుల్స్‌కి ఉమ్మడి జిల్లా నుంచి ఆరుగురు ఎంపికయ్యారు. నేహా (అనంతపురం), చక్రిక దండు (అనంతపురం), అర్షియా (కదిరి), హన్సిరెడ్డి (అనంతపురం), తేజశ్విని (కదిరి), హర్షిత (గుంతకల్లు) చోటు దక్కించుకున్నారు. గురువారం నుంచి విజయవాడ మూలపాడులో జరిగే టీ20 మ్యాచ్‌లకు ప్రాతినిధ్యం వహించనున్నారు. క్రికెటర్లను పలువురు అభినందించారు.

అంతర్జాతీయ శిక్షణకు శాప్ కోచ్ జబీవుల్లా

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వాలీబాల్ శిక్షణకు శాప్ కోచ్ జబీవుల్లా ఎంపికయ్యారు. అనంతపురం నీలం సంజీవరెడ్డి పీటీసీ స్టేడియంలో వాలీబాల్ శాప్ కోచ్‌గా పనిచేస్తున్న జెబీవుల్లా ఈనెల 22వ తేదీ నుంచి వారం రోజుల పాటు జరిగే ఫెడరేషన్ ఇంటర్నేషనల్ డీ వాలీబాల్ లెవల్-1 కోర్సుకు అర్హత సాధించారు. భారత్ నుంచి ఎంపికైన నలుగురు కోచ్‌లలో జెబీవుల్లా ఒకరు. దీంతో జెబీవుల్లాకు డీఎస్‌డీఓ ఉదయ్ భాస్కర్, శాప్ కోచ్‌లు అభినందనలు తెలిపారు.



ఆంధ్రజ్యోతి
ద్వారా మిమ్ములను అభిమానించే వారికి శ్రేయోభిలాషులకు, మిత్రులకు శుభాకాంక్షలు తెలియజేయండి.
Advertisements
జన్మదిన వేడుకలు | వివాహ శుభాకాంక్షలు
విదేశీయాన శుభాకాంక్షలు | స్వదేశాగమన శుభాకాంక్షలు
ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు | మొదలగు అన్ని రకముల పత్రికా ప్రకటనలకు మీ ఏరియాలోని మా ఏజెంటును సంప్రదించగలరు
యాడ్స్ డిపార్ట్‌మెంట్: 99854 11165, 99854 11179, 9900167475,
ప్రతి ప్రకటనపైన GST 5% వర్తించును.
అనంతపురం: 99854 10956, 99854 01208, 99854 01251, 99854 03749, 77804 27767
గుంతకల్లు: 89195 18075,
హిందూపురం: 97036 18698,
లేదా మీ సమీప ఆంధ్రజ్యోతి ఏజెంటును సంప్రదించండి.

వినియోగదారులే దేవుళ్లు

● ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు

పుట్టపర్తి రూరల్/అనంతపురం టౌన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): 'వినియోగదారులే మనకు దేవుళ్లని, వారికి నాణ్యమైన విద్యుత్‌ను అందించి సంతృప్తిపర చాలని ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్ రావు విద్యుత్‌సిబ్బందిని ఆదేశించారు. బీడుపల్లి సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన విద్యుత్ సరఫరా, సానుకూల ప్రజా అవగాహన సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన సర్వేలో పుట్టపర్తి, కదిరి, డివిజన్‌ల లో కొన్నిమండలాల్లో వినియోగ దారులకు సంతృప్తికరమైన సేవలందించలేకపోయామనే విషయం తేలిందన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో పారిశ్రామికీకరణ కోసం ఆర్డీఎస్ఎస్ 222 ఫీడర్లకు సంబంధించి రూ.500 కోట్లతో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు.


మాట్లాడుతున్న సీఎండీ సంతోష్‌రావు, పాల్గొన్న సిబ్బంది

విద్యుత్ అంతరాయాలు ఉండకూడదు

విద్యుత్ అంతరాయాలు కలగకుండా చూడాలని సిబ్బందిని ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు ఆదేశించారు. జేఎన్టీయూ ఆడిటోరియంలో అనంతపురం జిల్లా విద్యుత్‌శాఖ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. అంతకుముందు జిల్లాలోని పరిస్థితులపై అధికారులతో ఆరా తీశారు. రెవెన్యూ కలెక్షన్లు, విద్యుత్ అంతరాయాలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్లపై చర్చించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్లు పాడైపోతే వాటి స్థానాల్లో వెంటనే మరొకటి ఏర్పాటు చేయాలన్నారు. మరమ్మతులకు వచ్చిన ట్రాన్స్‌ఫార్మర్లను త్వరితగతిన పూర్తి చేయా లన్నారు. లైన్లు ఎక్కడెక్కడ దెబ్బతిన్నాయో వాటిని ముందుగానే గుర్తించి, వాటిని మార్పుచేసేలా చూడాలన్నారు. విద్యుత్ బకాయిలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సీజీఎం వర కుమార్, శ్రీసత్యసాయి జిల్లా ఎస్ఈ సంపత్‌కుమార్, అనంతపురం జిల్లా ఎస్ఈ శేషాద్రి శేఖర్, ఈఈలు రమేష్, రాజశేఖర్, డీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేలో సదుపాయాలు మెరుగుపడాలి: దక్షిణ మధ్య రైల్వే జీఎం

గుంతకల్లు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రైల్వే పరిధిలో ప్రజా సదుపాయాలు, ట్రాఫిక్ సౌకర్యాలు, పరిశుభ్రతా ప్రమాణాలు కాలానుగుణంగా మెరుగుపడాలని దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సూచించారు. ఆయన బుధవారం ఉదయం నుంచీ రాత్రి వరకూ గుంతకల్లు రైల్వే డివిజన్‌లో పర్యటించారు. సికింద్రాబాద్ నుంచి ప్రత్యేక రైలులో వచ్చిన జీఎం తొలుత తిరుపతి, రేణిగుంట రైల్వే జంక్షన్లలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. తిరుపతిలో అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద చేపడుతున్న పనులను సందర్శించారు. అభివృద్ధి పనుల విషయంగా గుంతకల్లు రైల్వే డివిజనల్ అధికారులతో చర్చించారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి కడప స్టేషన్‌లో జరుగుతున్న కన్‌స్ట్రక్షన్ వర్కులను తనిఖీ చేశారు. పర్యటనలో తిరుపతి నుంచి గుంతకల్లు వరకూ ప్రత్యేక రైలులో ట్రాక్, రైలు వంతెనల ప్రమాణాలను రీర్ విండోలో తనిఖీ చేశారు. సాయంత్రం గుంతకల్లుకు చేరుకుని స్థాని డీఆర్ఎం కార్యాలయంలో డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, వివిధ విభాగాల ఇన్‌చార్జి అధికారులతో డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులు, వివిధ ప్రాజెక్టులు, స్టేషన్ల పునర్నిర్మాణ పనులు, ట్రాఫిక్ సదుపాయాలు, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో హైదరాబాద్ డీఆర్ఎం సంతోష్‌కుమార్ వర్మ, జోనల్ అధికారులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ

ఇద్దరికి నీట్ పీజీలో ఉత్తమ ర్యాంకులు

అనంతపురం క్లాక్ టవర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నీట్ పీజీ ఫలితాల్లో జిల్లాకు చెందిన ఇద్దరు మెరుగైన ర్యాం కులు సాధించారు. అనంతపురం నగరంలో నివాసముంటున్న శోభారాణి తనయుడు శ్రీకృష్ణదేవరాయలు నీట్ పీజీ ఫలితాల్లో జాతీయస్థాయిలో 1,330వ ర్యాంకు దక్కించుకున్నాడు. 800 మార్కులకుగాను 621 మార్కులు సాధించాడు. అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలలో శ్రీకృష్ణదేవరాయలు ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. ఆర్డీటీలో పనిచేస్తున్న ఫీల్డ్ డాక్టర్ సయ్యద్ హుస్సేన్ తనయుడు సయ్యద్ షాహరార్ రఫత్ ఆలిండియా స్థా యిలో 10,907 ర్యాంకు సాధించాడు. 800మార్కులకుగాను 551 మా ర్కులు వచ్చాయి. కడప రిమ్స్‌లో రఫత్ ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. రాష్ట్రస్థాయిలో 400వ ర్యాంకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.


సయ్యద్ షాహరార్ రఫత్


శ్రీకృష్ణదేవరాయలు

డిగ్రీ ప్రవేశాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్

● కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

అనంతపురంరూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): డిగ్రీ నూతన ప్రవేశాలకు గురువారం నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యలత పేర్కొన్నారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ తదితర డిగ్రీ కోర్సుల ప్రవేశాలకు కళాశాలలో రిజిస్ట్రేషన్ హెల్ప్‌సెంటర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇంటర్ హాల్‌టికెట్, కులధ్రువీకరణ పత్రం, మెయిల్ ఐడీ, ఫోన్ నెంబర్, బ్యాంక్ పాస్‌బుక్, ఆధార్ కార్డ్‌ను తీసుకుని కళాశాలకు రావాలని సూచించారు. వివరాలకు 9440723244 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తు చేసుకోండి

కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సత్యలత తెలిపారు. తెలుగు, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్, సంస్కృతం సబ్జెక్టులకు గెస్ట్ ఫ్యాకల్టీని నియమిస్తామన్నారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ, ఆపైగాని ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు.

కొంతే మార్పు

● శిక్షణకు రెండో రోజు నలుగురే హాజరు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభు త్వం మహిళా ప్రజాప్రతినిధుల కోసం ఏర్పాటు చేసిన మార్పు కార్యక్రమానికి బుధవారం నలుగురు మాత్రమే హాజరయ్యారు. మహిళా ప్రజాప్రతినిధుల చైతన్యం కోసం మార్పు ద్వారా విజేతలు .. మహి ళా సాధికారితతో స్వపరిపాలన సాధ్యం అను అంశంపై మూడు రోజుల పాటు శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో ఏర్పాటు చేశారు. మంగళవారం ఇద్దరు మాత్రమే హాజరుకాగా బుధవారం నలుగురు మాత్రమే హాజరయ్యారు. బత్తలపల్లి, రాయదుర్గం ఎంపీపీలు, రాప్తాడు, అమరాపురం జడ్పీటీలు మాత్ర మే హాజరయ్యారు. గురువారం మూడోరోజు శిక్షణ ముగియనుంది.

టీచర్ల అంతర్‌జిల్లా బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

అనంతపురం విద్య, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల అంతర్‌జిల్లా బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కొన్నేళ్లుగా ఈ బదిలీల కోసం అనేక మంది ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీలు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసికెళ్లడంతో అంతర్‌జిల్లా బదిలీలకు ఆమోదం తెలిపారు. బుధవారం విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ అంతర్‌జిల్లా బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ బదిలీలలో కేవలం ఇరు పక్షల టీచర్ల కేడర్‌కు మాత్రమే అవకాశం కల్పించారు. బదిలీ కోరుకునే టీచర్లు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అపుడే పలువురు టీచర్లు మ్యూచువల్ కోసం వాట్సాప్ గ్రూపులలో విల్లింగ్ అడుగుతూ మెసేజ్‌లు పెడుతున్నారు.

ఉత్తమ టీచర్ల అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

అనంతపురం విద్య, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సెప్టెంబరు 5న జిల్లా స్థాయి ఉత్తమ టీచర్ల అవార్డులు ప్రదానం చేస్తామని, ఈ మేరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డులకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, మోడల్‌స్కూల్స్, కేజీబీవీలు, రెసిడెన్షియల్ స్కూల్స్, డైట్ కళాశాలలో పనిచేస్తున్న ప్రిన్సిపాల్స్, హెచ్ఎంలు, టీచర్లు అర్హులని పేర్కొన్నారు. కనీసం 10 ఏళ్ల సర్వీస్ ఉండాలని, గతంలో జిల్లా స్థాయి అవార్డు పొంది ఉండకూడదని, ఎలాంటి క్రిమినల్ కేసులు నమోదై ఉండకూడదని, శాఖాపరమైన చర్యలు ఉండరాదని పేర్కొన్నారు. జాతీయ స్థాయి అవార్డులకు దరఖాస్తు చేసిన టీచర్లు ఇందుకు అనర్హులని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న టీచర్లు ఈనెల 28 సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులు జిల్లా కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుందని డీఈఓ పేర్కొన్నారు.

49 మందికి ఉద్యోగోన్నతి

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో 49 మందికి గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు బుధవారం ప్రకటనలో తెలిపారు. డీపీఓ, డీఎల్‌పీఓ కార్యాలయాల సిబ్బంది, అర్హత కలిగిన గ్రేడ్-4 సెక్రటరీలు, జూనియర్ అసిస్టెంట్ కేటగిరీ, జేఏబీసీల ఫీడర్ కేటగిరీల నుంచి అర్హతలు పరిశీలించి గ్రేడ్-3 కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

ఏపీ నిట్‌లో బీటెక్ విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం ఏపీ నిట్‌లో బీటెక్ విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన బుధవారం నుంచి ప్రారంభమైంది. నిట్ విద్యాసంస్థలో మొత్తం 8 కోర్సులు నిర్వహిస్తుండగా ఆయా కోర్సులలో మొత్తం 484 సీట్లు ఉన్నాయి. వీటిలో 50 శాతం సీట్లను రాష్ట్రానికి చెందిన విద్యార్థులకు కేటాయిస్తారు. మిగిలిన సీట్లను జోసా, సీసాబ్ కౌన్సెలింగ్ ద్వారా ఇతర విద్యార్థులతో భర్తీ చేయనున్నారు. ఇటీవల నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 2025-26 సంవత్సరానికి సంబంధించి అన్ని సీట్లకు కేటాయింపులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పరిశీలన కేంద్రంలో విద్యార్థులు తమ ఒరిజనల్ ధ్రువపత్రాలను పరిశీలన చేయించుకోవడంతో పాటు ఫీజులు చెల్లించి కోర్సులలో చేరుతున్నారు. ఈ కార్యక్రమం ఈనెల 23వ తేదీ వరకు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని నిట్ అధికారులు తెలిపారు. అడ్మిషన్ల విషయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నట్టు డీన్ అకడమిక్ డాక్టర్ ఎన్.జయరాం తెలిపారు. తొలి రోజు మొత్తం 86 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందినట్టు తెలిపారు.

రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభం

● వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం చంద్రబాబు ● జేఎన్‌టీయూలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్‌ను జేఎన్‌టీయూఏలో బుధవారం అట్టహాసంగా ప్రారంభించారు. మంగళగిరి రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్‌తోపాటు రాష్ట్రంలోని ఐదు ప్రాంతాల్లో ఆర్‌టీఐహెచ్‌స్పోక్‌లను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు. స్థానికంగా కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే పరిటాల సునీత సెంటర్‌ను ప్రారంభించారు. ముందుగా రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్‌లో వివిధ సంస్థలు, స్టార్టప్స్, పరిశ్రమల ప్రతినిధులు ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించి వారి నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ అవసరాలు తీర్చే స్టార్టప్‌గా ఈ సెంటర్ అభివృద్ధికి కార్యాచరణను సిద్ధం చేసినట్లు తెలిపారు. కుటుంబానికో పారిశ్రామిక వేత్త నినాదం సాకారంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా గ్రిడ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో నాలెడ్జి పార్టనర్‌గా సెంట్రల్‌యూనివర్సిటీ, జేఎన్‌టీయూలు ఉన్నాయని, ఈ ఇన్నోవేషన్ హబ్‌కు డైరెక్టర్‌గా జిల్లా కలెక్టర్ తరఫున జాయింట్ కలెక్టర్ ఉన్నారని తెలిపారు. జిల్లాలో వివిధ రకాల పరిశ్రమలు, సంస్థలు ఉన్నాయని, అనంతపురం, కర్నూలు ఉమ్మడి జిల్లాలో ఉన్న విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జేసీ శివనారాయణ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కృష్ణయ్య, స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రతాపరెడ్డి, కియ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి రవిశంకర్‌రెడ్డి, జేఎస్‌డబ్ల్యూగ్రూప్ ప్రతినిధి పసుపాలక్, రేమాండ్స్ గ్రూప్ ప్రతినిధి నవీన్ శర్మ, భారత్ ఫోర్జ్ యోగేష్‌ఇనాందర్, అల్ట్రాటెక్ ప్రతినిధి గోపాల్‌రెడ్డి, అర్జస్‌స్టీల్స్ నరేందర్, సిప్లాన్ ప్రతినిధి చౌదరి, అటల్ ఇంకుబేషన్ చంద్రమౌళి, ఆర్డీఓ కేశవనాయుడు, జిల్లా పరిశ్రమల శాఖ ఏడీ రాజశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ హరికుమార్, ఆర్అండ్‌బీ డీఈ రాజగోపాల్, జేఈ బాలకాటమయ్య తదితరులు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్ తదితరులు

125 ఎకరాల్లో మినుముల సాగు


పడమర నడింపల్లి వద్ద పొలంలో మినుములు చల్లుతున్న రైతులు

నంబులపూలకుంట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలో 125 ఎకరాల్లో మినుము పంట సాగు చేస్తున్నట్లు ఏఓ లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వెలిచెలమల, గౌనపేట, వంకమద్ది, ధనియాన్‌చెరువు, దిగువతూపల్లి గ్రామాల పరిధిలో పంట సాగును ఆయన పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ.. విత్తన శుద్ధి దశ నుంచి పంట కోతవరకు పాటించాల్సిన యజామాన్య పద్ధతులను రైతులకు వివరించారు. ఎకరాకు 8 నుంచి 10 కిలోల విత్తనాలు విత్తుకోవాలన్నారు. ఆ సమయంలో హెక్టారుకు 20 కేజీల చొప్పున నత్రజని, భాస్వరం, పది కేజీల జింక్ సల్ఫేట్ దుక్కిలో వేసి కలియదున్నాలన్నారు. పదినుంచి 20రోజుల పైరు దశలో పార్మలా 4 పిచికారీ చేసుకోవాలన్నారు. కలుపు నివారణకు పిండి మిథాలిన్ 30శాతం 1.5 లీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి మరుసటిరోజు నేల అంతా తడిసేలా పిచికారీ చేసుకోవాలన్నారు. 70నుంచి 80రోజుల్లో పంట చేతికొస్తుందన్నారు. ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో రైతులు విజయ్‌కుమార్‌యాదవ్, చంద్రమోహన్‌రెడ్డి, వేణుగోపాల్, రైతు సేవా కేంద్రం సిబ్బంది కుమారి, రాధ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం


మాట్లాడుతున్న ఈగల్‌సెల్ ఇన్‌చార్జ్ హనుమంతు

అనంతపురం క్రైం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, గంజాయి, తదితర మత్తు పదార్థాలతో జీవితాలు నాశనమవుతాయని, విద్యార్థులు, యువత వాటికి దూరంగా ఉండాలని ఈగల్ సెల్ అనంతపురం ఇన్‌చార్జ్, ఎస్ఐ హనుమంతు సూచించారు. బుధవారం నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. పోస్టర్లు ఆవిష్కరించి, విద్యార్థుల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, నషా ముక్త్ భారత్‌గా మార్చడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల శారీరక, మానసిక రుగ్మతలు వస్తాయని, అనారోగ్యం బారిన పడుతారని అన్నారు. మత్తు పదార్థాల వినియోగిస్తే భారీగా శిక్షలు పడతాయని తెలిపారు. కార్యక్రమంలో విలకలాంగుల సంక్షేమ శాఖ అధికారి అనిల్‌కుమార్, ఆర్ట్స్ కళాశాల లెక్చరర్ బృందా, అధ్యాపకులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో చిరుజల్లులు

అనంతపురం అర్బన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం చిరుజల్లులు పడ్డాయి. అనంతపురం, పుట్లూరు, గార్లదిన్నె, ఉరవకొండ, బెలుగుప్ప, విడపనకల్లు, పామిడి తదితర ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసింది. జిల్లాలోని 8 మండలాల్లో మంగళవారం వర్షం పడింది. అత్యధికంగా కణేకల్లులో 5.2 మి.మీ వర్షం కురిసింది. డి.హిరేహాల్ 4.6, బ్రహ్మసముద్రం 4.2, విడపనకల్లు 2.8, గుత్తి, కుందుర్పి 2.2, రాయదుర్గం 2.0, పెద్దవడుగూరు 1.2 మి.మీ వర్షపాతం నమోదయింది.

ఉగ్రవాదుల సమాచారం తెలపండి

ధర్మవరం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పట్టణ, రూరల్ ప్రాంతాల్లో పాకిస్తాన్ ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నట్లుగా లేదా ఉగ్రవాదాన్ని ప్రేరేపించే వ్యక్తులు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఉగ్రవాదుల సమాచారాన్ని తెలిపితే పోలీస్‌శాఖ తరఫున బహుమతులు కూడా అందజేస్తామని డీఎస్పీ తెలిపారు. వన్‌టౌన్ సీఐ-9440796831, టూటౌన్ సీఐ 6305800429, రూరల్ సీఐ-9440796832 నెంబర్లకు సమాచారాన్ని అందించాలన్నారు.

కలెక్టర్ అనుమతి ఇచ్చారా..!

● నేడు సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టులకు ఇంటర్వ్యూలు..?

కొత్తచెరువు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఏలోని సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టుల భర్తీకి గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధమైనట్లు తెలిసింది. జిల్లాలో 10 పోస్టుల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్ జారీ చేశారు. ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. నిబంధనల మేరకు అర్హులు, అనర్హుల జాబితాను నోటీసు బోర్డులో పెట్టాలి. ఆ తరువాతే ఇంటర్వ్యూలు నిర్వహించాలి. కానీ ఇదేమీ లేకుండా గుట్టుచప్పుడుగా కాకుండా ఇంటర్వ్యూలకు సిద్ధమయ్యారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కొందరు తెలిపారు. ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు కలెక్టర్ అనుమతి కోసం తపాల్ పెట్టామని, అనుమతి రాగానే నిర్వహిస్తామని ఎస్ఎస్ఏ ఏపీసీ దేవరాజ్ అన్నారు. కానీ ఇప్పటికే ఇంటర్వ్యూలకు సిద్ధమయ్యారని, గురువారం నిర్వహిస్తారని ప్రచారం జరుగుతోంది.

కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అనంతపురం వైద్యం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పులు, వర్షాలతో దోమలు వ్యాప్తి చెంది కాలానుగుణ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందనీ, అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి.. అధికారులకు సూచించారు. బుధవారం రొనాల్డ్ రాస్ జయంతిని పురస్కరించుకుని ప్రపంచ దోమల నివారణ దినం నిర్వహించారు. రొనాల్డ్ రాస్ చిత్రపటానికి నివాళులర్పించారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయన్నారు. దోమలు పెరిగి, సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. దోమల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి ఓబులు, డెమో త్యాగరాజు, హెచ్ఈఓ నాగరాజు, గంగాధర్ పాల్గొన్నారు.


రొనాల్డ్ రాస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైద్యులు

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్‌క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్‌డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ.సంప్ర:7382114647
AJA- 246559

ఉచిత విద్యావకాశాలు
ఇంటర్‌పాస్ స్టూడెంట్స్‌కి B.Sc (Nursing). B.Sc (MLT),BPT (ఫిజియోథెరపీ) GNM (Nursing) DMLT (బ్లడ్‌టెస్ట్ కోర్సు) Goverment సీట్స్‌కి అడ్మిషన్లు జరుగుచున్నవి. ఫ్రీ ఎడ్యుకేషన్ మరియు ఫ్రీ హాస్టల్ కలదు. సంప్ర: జి.మురళి,అనంతపురం సెల్:9030661651.
AJA- 246554

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్ చిన్న ప్రకటన పెద్ద స్పందన

గాయత్రి జ్యోతిష్యం
పండిట్ ఎస్.వి.శాస్త్రిగారు 50సం॥లుగా ఆంధ్ర, కర్నాటకలో ప్రసిద్ధి చెందినారు. విద్య, స్త్రీ పురుష ప్రేమ, లగ్నం, సంతానం, స్త్రీ పురుష వశీకరణ, వ్యాపార ఆర్థిక కుటుంబ సమస్యలకు సంప్ర:9440532926
AJA-Sathish

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

అర్హులకు అన్యాయం జరగదు: ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): పింఛన్‌కు అన్ని అర్హతలు ఉన్న దివ్యాంగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎట్టిపరిస్థితుల్లోనూ అన్యాయం జరగదని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ బుధవారం ప్రకటనలో తెలిపారు. అర్హులైన దివ్యాంగుల సదరం సర్టిఫికెట్లను అధికారులు రీవెరిఫికేషన్ చేస్తారని, తద్వారా తప్పక న్యాయం జరుగుతుందని అన్నారు. ఎట్టి పరిస్థితిల్లోనూ అర్హులకు అన్యాయం జరగదని ఆమె పేర్కొన్నారు.

బాలామృతం మాయం కాలేదు: పీడీ

శింగనమల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): శింగనమల ఐసీడీఎస్ పరిధిలోని బాలమృతం బ్యాగులు మాయం కాలేదని, టెక్నికల్ సమస్యలతో వాటి పంపిణీని ఆన్‌లైన్‌లో నమోదు చేయలేకపోవడంతో సమస్య వచ్చిందని ఐసీడీఎస్ పీడీ నాగమణి తెలిపారు. ఆంధ్రజ్యోతి కథనంపై ఆమె స్పదించి, శింగనమల, బుక్కరాయసముద్రం, నార్పల అంగన్వాడీ సెంటర్ల నుంచి రికార్డులను శింగనమలకు తెప్పించుకుని బుధవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. అంగన్వాడీ సెంటర్లలో 484 బాలామృతం బ్యాగులు పంపిణీ చేశారని, అయితే అప్పట్లో సర్వర్, టెక్నికల్ సమస్యలతో వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదని తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతుకూలీ మృతి


రాజన్న (ఫైల్)

కనగానపల్లి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో విద్యుదాఘాతంతో రైతు కూలీ మృతి చెందాడు. బద్దలాపురానికి చెందిన తలారి రాజన్న రైతుకూలీగా జీవనం సాగిస్తుండేవాడు. కాగా కనగానపల్లి చెరువు మరమ్మతు కోసం ఇరిగేషన్ అధికారులు సర్వేపనులు చేయిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం చెరువులో కొలతలు వేసేందుకు అధికారులకు సహాయంగా రాజన్న వెళ్లాడు. పనుల్లో భాగంగా పొడవాడి ఇనుప కడ్డీని తీసుకెళ్తుండగా ప్రమాదవశాత్తు ఆ కడ్డీ పైన ఉన్న కరెంటు తీగలను తాకింది. దీంతో విద్యుత్ సరఫరా కావడంతో అతను షాక్ గురై అపస్మారక స్థితిలోకి వెళ్లా డు. స్థానికులు వెంటనే అక్కడి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వై ద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భా ర్య, ఐదుగురు సంతానం ఉన్నారు. కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆముదం విత్తనాల పంపిణీ

అనంతపురంరూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడి మి గ్రామంలో బుధవారం సీఏఆర్‌డీ ఏఫ్‌పీఓ సంస్థ వారు జాతీయ ఆహార భద్రత మిషన్ - నూనె గింజల పథకం కింద ఆముదం విత్తనాలను వేల్యూచైన్‌క్లస్టర్ ద్వారా రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమానికి అనంతపురం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు అల్తాఫ్ అలీఖాన్ హాజరై మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వం నూనె గింజల పంటల సాగు విస్తీర్ణం పెంచడం కోసం ఈ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. నరసనాయని కుంట సర్పంచు సులోచనమ్మ, ఏఓ వెంకట్‌కుమార్, ఏఈఓ మల్లికార్జున, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతుల తదితరులు పాల్గొన్నారు.

నూతన మూల్యాంకన విధానంతో సమస్యలు

● వెంటనే ఉపసంహరించుకోవాలి: ఏపీటీఎఫ్

అనంతపురం విద్య, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): కొత్తగా ప్రవేశపెట్టిన అసెస్‌మెంట్ పుస్తకాల్లో పరీక్ష, మూల్యాంకన విధానంతో పాఠశాలల్లో సమస్యలు వచ్చి పడుతున్నాయని ఏపీటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. ఏపీటీఎఫ్ నాయకులు బుధవారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిసారు. వారు మాట్లాడుతూ.. నూతన పరీక్షలవిధానం, మూల్యాంకనంతో పాఠశాలలో బోధన సమయం హరించుకుపోతోందన్నారు. దీంతో విద్యార్థులకు తీరనినష్టం వాటిల్లుతోందన్నారు. వెంటనే ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ నేతలు కోరారు. డీఈఓకు వినతిపత్రం అందజేసారు. కార్యక్రమంలో నాయకులు సిరాజుద్దీన్, నరసింహులు, సర్దార్ వలి, వన్నప్ప, నాగభూషణం, రంగనాయకులు, పుల్లయ్య, తిప్పేస్వామి, పర్వతయ్య, రామాంజనేయులు, రామ్మూర్తి, హనీఫ్ పాల్గొన్నారు.

డబుల్ రిజిస్ట్రేషన్లపై సీపీఐ ఆగ్రహం

● రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఆందోళన


ఆందోళన చేస్తున్న సీపీఐ శ్రేణులు

అనంతపురం విద్య, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): డబుల్ రిజిస్ట్రేషన్లపై సీపీఐ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్థానిక రాంనగర్‌లో గల రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. నగర కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ.. ఇటీవల సాయినగర్‌లో ఓ కంటివైద్య క్లినిక్‌ను డబుల్ రిజిస్టర్ చేయడంపై మండిపడ్డారు. రిజిస్ట్రార్ అక్రమాలపై విచారణ జరపాలని, డబుల్ రిజిస్ట్రేషన్‌లపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. ఒకదశలో రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. డబుల్ రిజిస్ట్రేషన్ బహిరంగ అవినీతి అని, అందుకు కారణమైన అధికారులు,సిబ్బందిపై వెంటనే చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. నాయకులు రమణ, పద్మావతి, లింగమయ్య, కృష్ణుడు, అల్లీపీరా, రాజు, ఎల్లుట్ల నారాయణస్వామి, చాంద్‌బాషా, జానకి, వరలక్ష్మి, శ్రీనివాస్, మంజునాథ్, మున్నా, ఖాజా సుందరరాజు తదితరులు పాల్గొన్నారు.

శివుడికి రుద్రాభిషేకం

అనంతపురం టౌన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక మూడో రోడ్డులోని బ్రాహ్మణ వసతి గృహంలో బుధవారం సాయంత్రం వేద విద్యార్థులు శివుడికి రుద్రాభిషేకం నిర్వహించారు. లోకకల్యాణం కోసం పరమ శివుడికి శాస్త్రోక్తంగా మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించడంతోపాటు ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు జరిపారు. బ్రాహ్మణ వసతి గృహం అధ్యక్షుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, కార్యదర్శి బదరీనాథ్, కోశాధికారి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మించాలని మోకాళ్లపై నిరసన

● నేడు తపోవనం రోడ్డు దిగ్బంధం

అనంతపురం టౌన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని తిక్కరంగయ్యస్వామి ఆలయం నుంచి తపోవనం వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేయడంతో పాటు రిషిత పబ్లిక్ స్కూల్ వద్ద వంకపై బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు నిర్వహించిన రిలే దీక్ష బుధవారానికి మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా తొలుత నీలిమ సర్కిల్ నుంచి రిషిత పబ్లిక్ స్కూల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తపోవనం రోడ్డులో మోకాళ్లపై బైఠాయించి నిరసన తెలిపారు. వారికి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి హాజరై మద్దతు తెలిపి మాట్లాడారు. సీపీఎం చేపట్టిన న్యాయమైన పోరాటానికి అనంతపురం నగరపాలకసంస్థ పాలకవర్గం, జిల్లా యంత్రాంగం స్పందించి బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు. సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా అనంతపురం నగర రోడ్ల పరిస్థితి మారకపోవడం శోచనీయమన్నారు. సమస్యలను పరిష్కరించేవరకు సీపీఎం పోరాడుతుందన్నారు. ఇందులో భాగంగా గురువారం తపోవనం రోడ్డు దిగ్బంధం చేయనున్నట్లు తెలిపారు. అనంతరం తపోవనం రోడ్డులో కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు లింగమయ్య, లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమర్నాథరెడ్డి, కార్పొరేటర్లు రామచంద్ర, శ్రీనివాసులు, సీపీఎం నగర కమిటీ సభ్యులు ప్రకాష్, ఇర్ఫాన్, వలి, జీవ, రాజు, గఫూర్, లతీఫ్, ప్రజానాట్యమండలి, మెడికల్ రెప్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.


మోకాళ్లపై నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు



శిథిలావస్థకు చేరిన మద్దలచెరువు, మామిళ్లపల్లిలోని ఆరోగ్య ఉపకేంద్రాల భవనాలు


మామిళ్లపల్లిలో ఆరుబయట వైద్యసేవలందిస్తున్న సిబ్బంది (ఫైల్)

అధ్వానంగా ఆరోగ్య ఉపకేంద్రాలు

- చాలా గ్రామాల్లో శిథిలావస్థకు చేరిన భవనాలు
- మరికొన్ని అరకొర సౌకర్యాల నడుమ అద్దెభవనాల్లో కొనసాగింపు
- వైద్యులు, రోగులకు తప్పని తిప్పలు

కనగానపల్లి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాలా వరకు ఆరోగ్య ఉప కేంద్రాలు దుస్థితిలో ఉన్నాయి. శిథిలావస్థ భవనాల్లో, అద్దెభవనాల్లో అరకొర వసతుల నడుమ కొనసాగుతుండడంతో వాటి వద్దకు వెళ్లి వైద్యసేవలు పొందాలంటే రోగులు ఆసక్తి చూపడం లేదు. మండల వ్యాప్తంగా ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు 12 ఉపకేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో మామిళ్లపల్లి, తగరకుంట, మద్దలచెరువు, నరసంపల్లి గ్రామాల్లో ఉన్న ఆరోగ్య ఉపకేంద్రాల భవనాలు పూర్తి శిథిలావస్థకు చేరాయి. వర్షం వచ్చినప్పుడు కారుతున్నాయి. దీంతో వాటిల్లో వైద్యసేవలందించడం కష్టంగా ఉంటుండం వల్ల సిబ్బంది ఆరుబయట సేవలు అందించే దుస్థితి నెలకొంటోంది. అలాగే తూముచెర్ల, కేఎన్‌పాళ్యం, కుర్లపల్లి తండా, మద్దలచెరువు-2 గ్రామాల్లోని ఉపకేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వాటిల్లో అరకొర సౌకర్యాలు ఉండడంతో రోగులు సరైన వైద్యసేవలు పొందలేకపోతున్నారు. ఇక దాదులూరు గ్రామంలో కొత్తగా భవనం పూర్తి అయినప్పటికీ కాంట్రాక్టర్‌కు బిల్లులు అందకపోవడం వల్ల దానిని వినియోగించని పరిస్తితి ఉంది. వైసీపీ ప్రభుత్వంలో నాడు-నేడు పేరుతో ఆరోగ్య కేంద్రాల రూపురేఖలు మారుస్తామని చెప్పిన అప్ప టి పాలకులు ఏమీ చేయలేకపోయారని, కూటమి ప్రభుత్వంలోనైనా ఆరోగ్య ఉపకేంద్రాలకు నిధులు వెచ్చించి శిథిల భవనాలు బాగు చేసి నాణ్యమైన వైద్యసేవలందించాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులకు నివేదించాం..

మండలంలో ఉన్న ఆరోగ్య ఉపకేంద్రాల భవనాల దుస్థితిపై ప్రభుత్వ ఉన్నతాధికారులకు నివేదించాం. భవనాలు పాతవి కావడంతో పెచ్చులూడి పడుతున్నాయి. వర్షాకాలంలో మరింత ఇబ్బందికర పరిస్థితి నెలకొంటోంది. వాటిపై ఉన్నతాధికారులకు నివేదిక అందించాం. అయితే రోగులకు వైద్యసేవలందించడం పట్ల ఎప్పటికప్పుడు సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం.

-డాక్టర్ చెన్నారెడ్డి, వైద్యాధికారి, కనగానపల్లి

పండమేరు వంకపై బ్రిడ్జి నిర్మిస్తాం: ఎమ్మెల్యే సునీత


పండమేరు వంకను పరిశీలిస్తున్న పరిటాల సునీత, టీసీ వరుణ్ తదితరులు

రాప్తాడు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపాన వెంకటరమణ స్వామి దేవాలయం వద్ద పండమేరు వంకపై బ్రిడ్జి నిర్మిస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. వంక పక్కన పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. పండమేరు వంక వద్ద గల ప్రదేశాన్ని అహుడా చైర్మన్ టీసీ వరుణ్‌తో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్కు నిర్మించి అందులో బోటింగ్ సౌకర్యం, వాటర్ ఫౌంటేన్, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామన్నారు. పండమేరు వంకపై బ్రిడ్జి నిర్మాణానికి సహకరించాలని టీసీ వరుణ్‌ను ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి, జనసేన ఇన్‌చార్జి పవన్, కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచ్ తిరుపాలు, పండమేటి రాయుడి ఆలయ కమిటీ చైర్మన్ దుబ్బ నారాయణ పాల్గొన్నారు.

పింఛన్‌దారుల క్యూ..


అర్జీలు అందజేస్తున్న పింఛన్ బాధితులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పునఃపరిశీలనలో భాగంగా దివ్యాంగ పింఛన్లు తొలగించడంతో బాధితులు అనంత నగరపాలక సంస్థ కార్యాలయానికి క్యూకట్టారు. వారి నుంచి పింఛన్ విభాగంలో అర్జీలు స్వీకరిస్తున్నారు. బుధవారం ఒక్కరోజే 370 అర్జీలు వచ్చినట్లు ఆ విభాగ ఇన్‌చార్జి కృష్ణమూర్తి తెలిపారు. వీటిలో 270 ఆన్‌లైన్ చేశామనీ, మిగిలినవి గురువారం చేస్తామన్నారు. న్యాయం చేయాలని దివ్యాంగులు వేడుకుంటున్నారు. నగరపాలక సంస్థ పరిధిలో రీవెరిఫికేషన్‌తో 1,008 పింఛన్లు తొలగించిన సంగతి తెలిసిందే. దీంతో నగర పాలక సంస్థకు బాధితులు వెల్లువలా వస్తున్నారు. తమకు అర్హత ఉందనీ, పింఛన్ ఇవ్వాలని అర్జీలు ఇచ్చుకుంటున్నారు.

'అర్హుల పింఛన్ల రద్దు దుర్మార్గం'

అనంతపురం రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): అర్హులైన దివ్యాంగుల పింఛన్ల రద్దు దుర్మార్గమని ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లాల కో ఆర్డినేటర్ హరినాథ్‌రెడ్డి అన్నారు. రూరల్‌మండల ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బుధవారం ఆయన మండలంలో అర్హులైన ఉండి పింఛన్లు రద్దు అయిన బాధితులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రీవెరిఫికేషన్ మాటున అర్హత కలిగిన దివ్యాంగుల పెన్షన్లను తొలగించారన్నారు. ఏళ్ల తరబడి పింఛన్లు అందుకుంటున్న వారి పింఛన్లు తీసివేయడం బాధకరమన్నారు. వచ్చేనెలలో అయినా వారికి తిరిగి పింఛన్లు మంజూరు చేయాలన్నారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ వద్ద సమితి ఆధ్వర్యంలో ధర్నా చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సమితి సభ్యులు పాల్గొన్నారు.

'ర్యాగింగ్‌తో జీవితాలను నాశనం చేసుకోవద్దు'


సదస్సులో మాట్లాడుతున్న రమేష్‌బాబు

అనంతపురం రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్‌కు పాల్పడి బంగారం లాంటి జీవితాలను నాశనం చేసుకో ద్దని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రమేషబాబు అన్నారు. వర్సిటీలోని ఎంబీఏ విభాగంలో బుధవారం యాంటీ ర్యాగింగ్ పై అవగాహన సదస్సు నిర్వహించారు.కార్యక్రమానికి రిజిస్ట్రార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ర్యాగింగ్ అనేది వద్దని పిలుపునిచ్చారు. ర్యాగింగ్ చేయడం వలన కలిగే దుష్ప్రయోజనాలను వివరించారు. అనవసరమైన వాటి కోసం జీవితాలను నాశనం చేసుకోరాదన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఆంజనేయులు, ఎంబీఏ విభాగాధిపతి ఆచార్య మురళీకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ కృష్ణుడు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'మల్బరీ సాగులో సేంద్రియ పద్ధతులతో అధిక ఆదాయం'

అనంతపురం అర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మల్బరీ సాగులో సేంద్రియ పద్ధతులు పాటించడం ద్వారా అధిక ఆదాయం వస్తుందని పట్టుపరిశ్రమ కేంద్రం శాస్త్రవేత్తలు మురళి, రమ్య సూచించారు. స్థానిక పట్టుపరిశ్రమ శాఖ కార్యాలయంలో బుధవారం వారు మేరా రేషమ్- మేరా అభియాన్‌లో భాగంగా పట్టు రైతులకు మల్బరీ సాగుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. వాణిజ్య పంటలకు బదులుగా పట్టుపరిశ్రమ వైపు రైతులు మొగ్గు చూపితే అధిక లాభాలు పొందవచ్చునన్నారు. తక్కువ పెట్టుబడితో ఏడాది పొడవునా ఆదాయం తీసుకునే మల్బరీ సాగు ఆవశ్యతపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. జిల్లా పట్టుపరిశ్రమ అధికారి విజయ్‌కుమార్, సెరికల్చర్ అధికారి మెహతా సుల్తానా, టెక్నికల్ అసిస్టెంట్లు రమాకాంత్‌రెడ్డి, అంజన్‌రెడ్డి, పట్టు రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు పంచాయతీల్లో బుధవారం డీపీఓ నాగరాజనాయుడు పారిశుధ్య పను లు పరిశీలించారు. కళ్యాణదుర్గం మండలం గోళ్ల, హులికల్లు, మల్లికార్జునపల్లి పంచాయతీల్లో పర్యటించి పరిశీలించారు. ఇంటింటి చెత్త సేకరణ అమలుపై స్థానిక మహిళలనడిగి తెలుసుకున్నారు. స్వమిత్వ సర్వేపై ఆరా తీశారు. కార్యక్రమంలో గోళ్ల పంచాయతీ కార్యదర్శి హేమలత, హులికల్లు పంచాయతీ కార్యదర్శి రవి, సర్పంచ్ చిత్తప్ప, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

శింగనమల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని తరిమెల గ్రామంలో గల వంకప్రాంతంలో ఉన్న పేకాట స్థావరంపై పోలీసులు బుధవారం దాడులు చేశారు. అందులో పేకాటాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. అలాగే వారి నుంచి రూ.35వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అందిన సమాచారం మేరకు దాడులు చేసినట్లు వారు పేర్కొన్నారు.

'పాత పద్ధతిలోనే నియామకాలు చేపట్టాలి'

అనంతపురంవిద్య, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ టీచర్ల నియామకాలను పాతపద్ధతిలోనే మెరిట్‌లిస్టు విడుదల చేసిన తర్వాతనే చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుళ్లాయప్ప డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో మెరిట్ లిస్టు ఇవ్వడం వల్ల ఎవరికి ఎన్నిమార్కులు వచ్చాయి, ఎన్నిమార్కులకు కటాఫ్ అయ్యాయి అభ్యర్థులు సులభంగా తెలుసుకునేవారన్నారు. ఈసారి అలా కాకుండా పారదర్శకతపేరుతో అర్హత పొందిన అభ్యర్థులకు నేరుగా మెసేజ్‌లు పంపిస్తారనే ప్రచారంజరుగుతోందని, దీనివల్ల డీఎస్సీ అభ్యర్థులలో గందరగోళం నెలకుంటుందని అన్నారు. అందుకే పాత పద్ధతిలోనే నియామకాలు చేపట్టాలన్నారు. ఏఐ ఎస్ఎఫ్ నాయకులు మంజునాథ్,నాని, సమీర్, బాబ్జాన్ పాల్గొన్నారు.

23న ప్రాంగణ నియామకాలు

అనంతపురం రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల పీవీకేకే డిగ్రీ, పీజీ కళాశాలలో సీఈఏటీ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను ఈనెల 23న నిర్వహించనున్నట్లు ప్రాంగణ నియామకాల అధికారి భానుకిరణ్, ప్రిన్సిపాల్ రాఘవేంద్ర ప్రసాద్ బుధవారం ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ 2022 నుంచి 2025 వరకు ఉత్తీర్ణులైన విద్యార్థులు, బీసీఏ 2022 నుంచి 2025 వరకు ఉత్తీర్ణులైన విద్యార్థులు హాజరుకావచ్చునన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి వార్షిక వేతనం రూ.3లక్షలతోపాటు భోజనం, రవాణా సౌకర్యం కల్పిస్తామన్నారు. చెన్నైలో పనిచేయాల్సి ఉంటుందని చెప్పారు.

కొత్తగాదిగకుంటలో మీ సమస్య-మా బాధ్యత

రామగిరి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తగాదిగకుంట గ్రామంలో టీడీపీ నాయకులు, అధికారులు బుధవారం మీ సమస్య-మా బాధ్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో స్థానికులతో పాటు పీఆర్‌కొట్టాల, మాధాపురం గ్రామాల ప్రజలు పాల్గొని వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రాలను వారికి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు రామ్మూర్తినాయుడు, మండలకన్వీనర్ సుధాకర్, మాదాపురం సర్పంచ్ గంగమ్మ, నాయకులు పాల్గొన్నారు.

మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి: సీఐ

శింగనమల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): శింగనమల సర్కిల్ పరిధిలోని మూడు మండలాల్లో వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సీఐ కౌలుట్లయ్య సూచించారు. శింగనమల పోలీసు స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వినాయక చవితి సందర్భంగా విగ్రహాలు నెలకొల్పేందుకు మండపాలను బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అనుమతులు తీసుకున్నాకే వాటిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. మూడురోజులు పాటు విగ్రహాల ఏర్పాటుకు అనమతలిస్తామన్నారు. పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని, నిమజ్జన సమయంలో డీజేలు లాంటివి వినియోగించరాదని తెలిపారు. ఎస్ఐ విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి..

గార్లదిన్నె: వినాయక మండపాల ఏర్పాటులో జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ ఏఈ విజయ్‌కుమార్ ప్రకటనలో సూచించారు. వినాయక మండపాల వద్ద విద్యుత్ తీగలు, స్తంభాలు ఏర్పాటు చేసుకునే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయని, దీంతో ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి):చట్టాల గురించి మహిళలు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మహాశక్తి సీఈఓ రమీజా సూచించారు. మండలంలోని ఎర్రంపల్లిగ్రామంలో బుధవారం మహాశక్తి సమాఖ్య ఆధ్వర్యంలో ఉచిత న్యాయసేవా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గృహహింస చట్టంపై ఆదిశక్తి సొసైటీ సిబ్బంది, పాలక వర్గం సభ్యులు నాటిక రూపంలో ప్రదర్శించి అవగాహన కల్పించారు. హింసకు గురవుతున్న ప్రతి మహిళ చట్టం ద్వారా హింసను ఏవిధంగా తగ్గించుకోవాలన్న విషయాలను సీఈఓ వివరించారు. ఆదిశక్తి సొసైటీ అధ్యక్షురాలు అశ్వర్థమ్మ, ప్రధానకార్యనిర్వహణ అధికారి కవిత, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

● రామగిరి: మండలంలోని మాదాపురం గ్రామంలో మహిళా శక్తి సొసైటీ, టింబక్టుకలెక్టివ్ ఆధ్వర్యంలో మహిళలకు చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. టింబక్టు కలెక్టివ్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ గౌరి, మహిళాశక్తి సొసైటీ అధ్యక్షురాలు కాంతమ్మ, సీఈఓ కాంచన, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం


కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

అనంతపురం టౌన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాస బహుళ ద్వాదశిని పురస్కరించుకుని లోకకల్యాణం కోసం తపోవనం శివశక్తిసాయి ఆలయంలో బుధవారం సాయి ట్రస్టు ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయ ఆవరణలో హనుమద్ సమేత సీతారామలక్ష్మణుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి వేదమంత్రోచ్చారణల నడుమ కల్యాణాన్ని జరిపించారు. భక్తులు పెద్దఎత్తున వచ్చి వేడుకను తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త మనూరు నాగరాజరావు, సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్, ఆలయ ధర్మకర్త శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన

అనంతపురం వైద్యం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని శారదా స్కూల్లో విద్యార్థులకు బుధవారం జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ సూపర్‌వైజర్ జీవీ రమణ ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్ష చూపరాదన్నారు. ఎయిడ్స్ నియంత్రణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యాధి నివారణ, నియంత్రణకు ఎయిడ్స్ చట్టం-2017, ఏఆర్టీ మందులు, ఏపీసాక్స్ యాప్, టోల్ ఫ్రీ నంబర్ 1097 తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సిబ్బంది నరేష్, అలివేలు, అనిత, శివ, అరుణ, ఈశ్వరయ్య ప్రిన్సిపాల్ నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు అందజేస్తాం

● నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నగరంలో ఉన్న వీధి వ్యాపారుల సర్వే చేసి గుర్తింపు కార్డులు అందజేస్తామని అనంత నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి తెలిపారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం ఆయన వీధివ్యాపారుల (టౌన్ వెండింగ్) కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ వీధి వ్యాపారుల సర్వే చేసి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని, అనంతరం వారికి గుర్తింపు కార్డులు, వెండింగ్ సర్టిఫికెట్ అందజేయాలని కమిటీలో చర్చించినట్లు తెలిపారు. నగరంలో సమస్యగా మారిన ట్రాఫిక్ నియంత్రణకు వీధి వ్యాపారులు సహకరించాలని కోరారు. స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ ఏర్పాటుపై సమాలోచనలు చేశామని, వీధి వ్యాపారులు క్రమబద్ధమైన వ్యాపార పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా వ్యవస్థీకృతమైన, నియంత్రిత వీధి విక్రయ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎంహెచ్‌ఓ రంగస్వామి, టీపీఎస్ మంజుల, టీఈ భవాని, సీఎంఎం కాటమయ్య, సీఓలు, టౌన్‌వెండింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన


రోడ్డు నాణ్యత పరిశీలిస్తున్న అధికారులు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిధిలోని కొత్తచెరువు మండలం తలమర్ల నుంచి ఈరగంపల్లి వరకు నాబార్డు నిధులతో నిర్మిస్తున్న బీటీ రోడ్డును క్వాలిటీ కంట్రోల్ ఈఈ మల్లికార్జున మూర్తి బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. ఎక్కడా ఎలాంటి లోపాలకు తావు లేకుండా రోడ్డు నిర్మాణం జరిగేలా చూడాలని స్థానిక సిబ్బందిని, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. తనిఖీల్లో పుట్టపర్తి పీఐయూ ఈఈ శంకరయ్య, డీఈఈ విశ్వనాథరెడ్డి, కదిరి క్యూసీ ఏఈఈ తులసీప్రసాద్, పుట్టపర్తి పీఐయూ ఏఈఈ మల్లికార్జున, కాంట్రాక్టర్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి: సీపీఐ

గార్లదిన్నె, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో త్వరలో జరిగే సీపీఐ రాష్ట్ర 28వ మహా సభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గం సహాయ కార్యదర్శి చెన్నప్ప యాదవ్ పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్లను మండలకేంద్రంలో బుధవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు శ్రీనాథ్‌చౌదరి, గార్లదిన్నె, శింగనమల మండలాల సీపీఐ మండల కార్యదర్శిలు ఎండీ రాముడు, మధు యాదవ్, సహాయ కార్యదర్శి రామకృష్ణ, ఓబన్న తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక ఒడిబియ్యం


సామూహిక ఒడిబియ్యంలో పాల్గొన్న మహిళలు

అనంతపురం టౌన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : శ్రావణమాసాన్ని పురస్కరించుకుని స్థానిక సూర్యనగర్ 80 అడుగుల రోడ్డులో గల మల్లాలమ్మ ఆలయంలో బుధవారం సామూహిక ఒడిబియ్యం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత మల్లాలమ్మ మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు చేసి విశేష పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో దాదాపు 400 మంది మహిళలకు సామూహికంగా ఒడిబియ్యం సమర్పించి అన్నదానం చేపట్టారు. మేదరి సంఘం ప్రధాన కార్యదర్శి పోలేపల్లి నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గ్రంధి రామోజీ, కోశాధికారి వైకుంఠరావు, జిల్లా అధ్యక్షుడు తమ్మినేని రామచంద్ర, ప్రధాన కార్యదర్శి మురళి, కులపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం

శింగనమల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నాగులగుడ్డం, నాగులగుడ్డంతండాలో బీజేపీ నాయకులు కేంద్రప్రభుత్వ పథకాలపై బుధవారం ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు ఓబిరెడ్డి, నాయకులు వెంకటయ్య శ్రీనివాసులు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



కందికి కలుపు బెడద

● వర్షాలకు విపరీతంగా పెరిగిన వైనం
● ఆర్థిక భారంతో రైతులు విలవిల

బెళుగుప్ప, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగు చేసిన కంది పంటకు కలుపు మొక్కల బెడద వెంటాడుతోంది. వేరుశనగ పంటలు సాగు చేసి నష్టాలపాలైన రైతులు నాలుగైదేళ్లుగా ప్రత్యామ్నాయంగా కందిపంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఎర్ర, నల్లరేగడి భూముల్లో ఈ పంటను సాగు చేస్తున్నారు. మండలంతో పాటు కళ్యాణదుర్గం, రాయదుర్గం ప్రాంతాలకు వెళ్లి కౌలుకు తీసుకుని వేలాది ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తున్నారు. మండలంలో ఈ యేడాది పది వేల ఎకరాల్లో ఈ పంటను సాగుచేస్తున్నారు. ఇటీవల ఎడతెరపిలేని వర్షాలు కురుస్తుండటంతో పొలాల్లో కలుపు మొక్కలు విపరీతంగా పెరిగాయి. వాటిని తొలగించడం భారంగా మారుతోంది. సమయం లేదు. తేమ ఎక్కువగా ఉండటంతో గుంటకతో తొలగించడానికి వీలు కావడం లేదు. కూలీలతో కలుపు మొక్కలు తొలగించాలంటే ఆర్థిక భారం పడుతోంది. ఒక్కొక్క కూలీకు రూ.250 చెల్లించాలి. మొక్కతో పాటు గడ్డి కూడా భారీ పెరిగింది. కంది పైరు ఏపుగా పెరగకుండా ఈ కలుపు మొక్కలు ఆటంకంగా మారుతున్నాయని, దిగుబడి తగ్గే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గడ్డి ప్రభావంతో పచ్చపురుగు కూడా ఆశిస్తుందని వాపోతున్నారు.



కంది పంటలో పెరిగిన గడ్డి మొక్కలు

గడ్డి ఏపుగా పెరిగింది



ప్రతి రోజూ వర్షం కురుస్తోంది. కలుపు మొక్కలు, గడ్డి భారీగా పెరిగింది. తొలగించడానికి వీలు కావడం లేదు. 35 ఎకరాల్లో కంది పంట సాగు చేశా. కంది మొక్కపై గడ్డి ప్రభావంతో పెరగకుండా తెగుళ్ల బారిన పడుతోంది.

-రుద్రన్న, రైతు, ఎర్రగుడి

దిక్కుతోచడం లేదు



వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన కంది పంటకు గడ్డి బెడద సమస్య వెంటాడుతోంది. 18 ఎకరాల్లో సాగు చేశాను. మొక్క కనిపించని విధంగా కలుపు మొక్కలు పెరిగాయి. దిక్కుతోచడం లేదు.

-ప్రతాపులు, కోనాపురం

కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు: ఎమ్మెల్యే

గుత్తి ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పార్టీ అభివృద్ధి కోసం కష్ట పడిన కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే గుమ్మనూర్ జయరాం పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో నూతన పాలక వర్గ ప్రమాణస్వీకారాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక గాంధీ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా మార్కెట్ యార్డు వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన సభలో మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా జక్కలచెరువుకు చెందిన గుర్రాల సూర్య ప్రతాప్ నాయుడు, వైస్ ఛైర్మన్‌గా మాలిక్ బాషాతో మార్కెట్ యార్డు కార్యదర్శి బాలాజీరావు ప్రమాణ స్వీకారం చేయించారు. కమిటీ డైరెక్టర్లుగా బావిగడ్డ ఓబుళయ్య, భారతీ, సుబ్బలక్ష్మి, హరిక్రిష్ణ, నాగ వీరమ్మ, నాగేశ్వర్ రావు, వెంకటేశ్, క్రిష్ణాబాయి, లక్ష్మి, సరస్వతి, రంగా రెడ్డి, మిద్దె ఓబుళేసు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని, అందులో భాగంగా మార్కెట్ యార్డు కమిటీలకు పూర్వవైభవం తెస్తోందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి, జన సేన నియోజకవర్గం కన్వీనర్ వాసుగిరి మణికంఠ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్, రాష్ట్ర నాయకులు అంకాల రెడ్డి, పట్టణ మండల టీడీపీ అధ్యక్షుడు ఎంకే చౌదరి, భద్రి వలి, గుత్తి గుంతకల్లు సింగిల్ విండో అధ్యక్షులు శివశంకర్, మస్తానప్ప, పాటిల్ సురేష్, న్యాయవాది సోముశేఖర్, నాయకులు చికెన్ శ్రీనివాసులు, రమేష్, రాజా, ప్రసాద్, శ్రీదేవి, సునీత, సర్పంచ్‌లు భరత్‌కుమార్, లింగమయ్య పాల్గొన్నారు.



మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా ప్రమాణం చేస్తున్న సూర్య ప్రతాప్

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

రాయదుర్గంరూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక కణేకల్లు రోడ్డు 10వ వార్డు వడ్డేవారి వీధిలోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు వడ్డే సంఘం నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ప్రతిష్ఠించిన ధ్వజస్తంభం

న్యూస్ బాక్స్

పింఛన్‌కు దరఖాస్తు చేసుకోండి

పుట్లూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు కారణాలతో అనేక మందికి పింఛన్లు తొలగించారని, అందులో అర్హులుంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ అలివేలమ్మ బుధవారం తెలిపారు. మండలంలో ఇప్పటికే సుమారు 45 మంది పింఛన్లు అప్‌లోడ్ చేశామని, నోటీసులు ఇచ్చి తొలగించిన పింఛన్‌దారుల్లో అర్హులుంటే ఆయా గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

● గుమ్మఘట్ట: మండలంలోని వివిధ గ్రామాల్లో తొలగించిన దివ్యాంగుల పింఛన్ల పునరుద్ధరణ కోసం 46 వినతులు అందినట్లు ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. కొద్దినెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వం అనర్హులైన దివ్యాంగుల పింఛన్‌దారులను గుర్తించడానికి ఇతర జిల్లాల నుంచి వైద్యులతో తనిఖీలు చేపట్టి.. అనేక మంది పింఛన్లను తొలగించిందన్నారు. అర్హులైన తమ పింఛన్లు తొలగించారని వివిధ గ్రామాల నుంచి దివ్యాంగులు మొరపెట్టుకోవడంతో ప్రభుత్వం మరోసారి ఆ పింఛన్ల పునరుద్ధరణకు అవకాశం కల్పించినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 24వ తేదీలోగా అర్హులైన దివ్యాంగులు ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

● కూడేరు: తమకు పింఛన్లను పునరుద్ధరించాలని మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 169 మంది దివ్యాంగులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీఓ కుళ్లాయిస్వామికి బుధవారం విజ్ఞప్తి చేశారు. సచివాలయంలో తిరిగి దరఖాస్తు చేసుకోవాలని ఆయన వారికి సూచించారు.

సింగిల్ విండో ఛైర్మన్ ఏకగ్రీవం

పెద్దపప్పూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని వరదయ్యపల్లి, ముచ్చుకోట, తమలదిన్నె, కొత్తపల్లి గ్రామాలకు సంబంధించిన సింగిల్ విండో ఛైర్మన్ ఎన్నికను బుధవారం అధికారులు నిర్వహించారు. ఛైర్మన్‌గా టీసీ నారాయణను... మెంబర్లుగా లక్ష్మీనారాయణ రెడ్డి, ఆదిలక్ష్మమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు తాతిరెడ్డి లోకనాథ్‌రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, జి. వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉట్టికొట్టే కార్యక్రమం

ఉరవకొండ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయం సమీపంలో బుధవారం నిర్వహించిన ఉట్టికొట్టే కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఉట్ల పరుసు కార్యక్రమంలో భాగంగా ఉత్సవమూర్తులను ఆమిద్యాల నుంచి మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు. యువకులు ఉట్టికొట్టేందుకు పోటీ పడ్డారు. కార్యక్రమంలో సిబ్బంది మారుతి, అర్చకులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి



అంపమ్మ (ఫైల్)

విడపనకల్లు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని హావళిగి వీఆర్‌ఏ అంపమ్మ(50) అనారోగ్యంతో బుధవారం ఉదయం మరణించింది. డిప్యూటీ తహసీల్దారు చంద్రమోహన్ రావు, తన సిబ్బందితో కలిసి ఆ గ్రామానికి వెళ్లి.. ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం బాధిత కుటుంబానికి రూ.25వేలు అందజేశారు.

దరఖాస్తు చేసుకోండి

తాడిపత్రి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ మంతేసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమవద్ద కోపా, మెకానిక్ డీజిల్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్ మెన్ సివిల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈనెల 26 సాయంత్రం 5గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 27న సర్టిఫికెట్ వెరిఫికేషన్, 29న ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో కౌన్సిలింగ్ ఉంటుందని తెలిపారు. అభ్యర్థులకు ఎటువంటి కాల్‌లెటర్లను పంపించబోమన్నారు.

ప్రభుత్వ ఖాజీగా రెహ్మాన్



పామిడి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రభుత్వ ఖాజీగా మౌలానా అల్హాజ్ ఫజ్లూర్ రెహ్మాన్ సాహెబ్‌ను నియమించినట్లు జిల్లా మైనార్టీస్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరక్టర్ రామసుబ్బారెడ్డి ప్రకటనలో తెలిపారు. రెహ్మాన్‌కు ఉత్తర్వులను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అందజేశారు.

జీఎంకు సమస్యలపై వినతులు

గుంతకల్లు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రైల్వే డివిజన్ పర్యటన నిమిత్తం బుధవారం గుంతకల్లుకు వచ్చిన దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవతో మజ్దూర్ యూనియన్, ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు భేటీ అయ్యారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతులను సమర్పించారు. రైల్వే క్వార్టర్సును నిర్మించాలని, కన్వెన్షన్ హాల్‌ను నిర్మించాలని, బళ్లారిలోని కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లేలా అక్కడి హాస్పిటల్స్ పేర్లను సర్వీస్ జాబితాలో చేర్చాలని, యర్రగుంట్లలో హెల్త్ యూనిట్‌ను ఏర్పాటుచేయాలని, గ్యాంగ్‌మెన్‌కు గ్యాంగ్ హట్స్, రెస్టురూములను ఏర్పాటుచేయాలని, ప్రమోషనల్ కోటా కింద సీనియర్ క్లర్కు పోస్టులను బర్తీచేయాలని యూనియన్ డివిజనల్ కార్యదర్శి విజయకుమార్ కోరారు.

ఎంప్లాయిస్ సంఘ్ వినతి: జీఎంను కలసిన ఎంప్లాయిస్ సంఘ్ డివిజనల్ కార్యదర్శి ప్రభాకర్, ఏడీఎస్ కే మల్లికార్జున కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై విన్నపాలు చేశారు. చిన్నకారణాలతో రిజెక్టు అయిన కారుణ్య నియామకాల అభ్యర్థనలను పునః సమీక్షించాలన్నారు. సేఫ్టీ కేటగిరిలోని ఉద్యోగులకు సకాలంలో ప్రమోషన్లను ఇవ్వాలని, గ్యాంగ్‌మెన్‌కు హట్స్‌ను ఏర్పాటుచేయాలని, ట్రాక్ మెయింటెనర్లకు టూల్ బాక్సులను ఇవ్వాలని, రక్షక్ అలర్ట్ ఎక్విప్‌మెంట్‌ను అందజేయాలని జీఎంకు వినతిపత్రాన్ని అందజేశారు.

కంప్యూటర్, ఫర్నీచర్ వితరణ

పుట్లూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడవకల్లు ప్రాథమిక పాఠశాలకు ఐడీబీఐ బ్యాంక్ ప్రతినిధులు రూ.1.75 లక్షల విలువైన కంప్యూటర్, ఫర్నీచర్, మైకులను బుధవారం అందజేశారు. ఇందులో ఆ బ్యాంక్ రీజనల్ మేనేజర్ సాయిక్రిష్ణ, బ్యాంక్ ప్రతినిధులు, ఎంఈఓ శ్రీదేవి పాల్గొన్నారు.

నేడు ప్రమాణ స్వీకారం

యల్లనూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక సహకార సొసైటీ సభ్యులు గురువారం ప్రమాణస్వీకారం చేస్తున్నట్లు సొసైటీ సీఈఓ వీరనారప్ప తెలిపారు. స్థానిక సహకార కార్యాలయ భవనంలో అధ్యక్షుడిగా తరిగోపుల అనిల్‌కుమార్ డైరక్టర్లుగా దొడ్లో సుబ్బరాయుడు, శింగవరం రవి ప్రమాణస్వీకారం చేస్తారన్నారు.

డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌పై సమావేశాలు

కళ్యాణదుర్గం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం మున్సిపాలిటీకు సంబంధించి డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌పై అభ్యంతరాలు, సూచనల స్వీకరణకు గురు, శుక్రవారాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ తెలిపారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఈ సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు.

పెన్షనర్ల సంఘానికి విరాళం

తాడిపత్రి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీచర్స్ కాలనీలోని పెన్షనర్ల సంఘానికి విశ్రాంత ఉపాధ్యాయుడు పరమేశ్వర్‌రెడ్డి బుధవారం రూ.10వేలు విరాళంగా ఇచ్చారని ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం తరపున చేస్తున్న సేవలకు ఈ విరాళం అందజేశారన్నారు.

మార్కెట్ వేలం

శెట్టూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే మార్కెట్‌కు బుధవారం పంచాయతీ కార్యాలయం వద్ద వేలంపాట నిర్వహించారు. ప్రభాకర్ అనే వ్యక్తి వేలంపాటలో రూ.1.73 లక్షలకు సంతను దక్కించుకున్నాడు.

వైభవంగా ఆది చెన్నకేశవస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఉరవకొండ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని కొనకొండ్ల గ్రామంలో ఆదిచెన్నకేశవస్వామి రథోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్లి రథంలో ఉంచారు. ఉదయం మడుగుతేరును నిర్వహించారు. సాయంత్రం ఉట్ల ఉత్సవం అనంతరం రథోత్సవాన్ని నిర్వహించారు. ఈ రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి గ్రూప్ టెంపుల్ అధికారి కృష్ణయ్య పాల్గొన్నారు.

ఉచిత ప్రయాణం ఎలా ఉంది..?

మహిళా ప్రయాణికులతో ఎమ్మెల్యే ఆరా




మహిళా ప్రయాణికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని

బ్రహ్మసముద్రం, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం ఎలా ఉంది.. ఇబ్బందులు ఏమీ లేవు కాదా.. అని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు బస్సులో ప్రయాణిస్తున్న మహిళల వద్ద ఆరా తీశారు. బుధవారం మండలంలోని గొంచిరెడ్డిపల్లి గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు. ఆ సమయంలో అటుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఎక్కి మహిళలతో ముచ్చటించారు. స్త్రీశక్తి పథకం ఎలా ఉందని, ఉచిత బస్సు ప్రయాణం సంతృప్తికరంగా ఉందా అని అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం బాగా పనిచేస్తోందని.. ఉచిత బస్సు ప్రయాణం బాగా ఉందని మహిళలందరూ సంతోషం వ్యక్తం చేశారు.

నిర్మాణాలను పూర్తి చేయిస్తాం: బ్రహ్మసముద్రం మండలం నాగిరెడ్డిపల్లి గ్రామంలో మారెమ్మ జాతరలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తిరిగి వస్తూ గొంచిరెడ్డిపల్లిలో ఆయన పర్యటించారు. గ్రామంలో పాఠశాల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయనీ, కొత్త భవనాల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయని గ్రామస్థులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్యే వద్ద వాపోయారు. దీంతో ఎమ్మెల్యే వాటిని పరిశీలించారు. విద్యార్థుల చదువుకు ఇబ్బంది లేకుండా నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

టీడీపీ కౌన్సిలర్ షరీఫ్ మృతి



మహమ్మద్ షరీఫ్ (ఫైల్)

గుంతకల్లు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన 35 వార్డు టీడీపీ కౌన్సిలరు మహమ్మద్ షరీఫ్ మృతిచెందారు. కొన్నేళ్లుగా కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న షరీఫ్ సంవత్సర కాలంగా డయాలసిస్ చేయించుకుంటున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం సాయంత్రం డయాలసిస్ చేయించుకుంటున్న సమయంలో కన్నుమూశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడు ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, బండారు ఆనంద్, గుణశేఖర్, ఫజులు, రామన్న చౌదరి, అంజి, గుజరీ మహమ్మద్ ఖాజా, వైసీపీ నాయకుడు మంజునాథ్, తదితరులు మహమ్మద్ షరీఫ్ ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులకు తమ సంతాపాన్ని తెలిపారు. షరీఫ్ 14 సంవత్సరాల నుంచి టీడీపీలో సేవలందిస్తున్నారు. సౌమ్యుడిగా పేరున్న షరీఫ్ కిడ్నీ సమస్యలతో బాధపడుతూనే గత మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలరుగా విజయం సాధించారు.



గంధం ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఉరుసు ఉత్సవాలు ప్రారంభం



అలంకరణలో దర్గా

ఉరవకొండ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక బీబీ జైనబ్బీ దర్గా ఉరుసు ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దర్గాలో అమ్మవారి సమాధిని వివిధ పూలతో అలంకరించి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉరుసు ఉత్సవాల్లో భాగంగా గంధం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అల్లపరెడ్డి ఇంటి నుంచి గంధం బయలుదేరి మేళతాళాల మధ్య పట్టణంలోని వీధుల్లో ఊరేగిస్తూ.. తెల్లవారుజామున దర్గాకు చేర్చారు. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీలో అవినీతిని నిగ్గుతేల్చండి

పాలకవర్గ సభ్యుల డిమాండ్



వినతిపత్రం అందజేస్తున్న ఉప సర్పంచు, వార్డు సభ్యులు

యాడికి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పంచాయతీలో జరిగిన అవినీతిని నిగ్గు తేల్చాలని.. అంతవరకూ ఎటువంటి తీర్మానాలకు తాము ఆమోదించే ప్రశక్తేలేదని గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు తేల్చిచెప్పారు. బుధవారం సర్పంచు అనూరాధ అధ్యక్షతన యాడికి గ్రామపంచాయతీ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీలో చేపట్టాల్సిన పనులను అధికారులు చదివి వినిపించారు. వీటిపై తీర్మానం కోసం ఆమోదం కోరారు. దీనిని ఉప సర్పంచ్ చంద్రమోహన్‌తో సహా వార్డు సభ్యులు అందరూ వ్యతిరేకించారు. గ్రామపంచాయతీ రూ.50 లక్షలకుపైగా నిధులు దుర్వినియోగం చేశారని, గ్రామపంచాయతీతో సంబంధంలేని వ్యక్తులకు బిల్లులు ఎలా చెల్లిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అవినీతిపై నిగ్గు తేల్చకుండా ప్రజల్లోకి వెళితే తమను చెప్పులతో కొడతారని, ఈ విషయం తేలేంతవరకూ ఎటువంటి తీర్మానాలనూ తాము ఆమోదించబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు వారు డిప్యూటీ ఎంపీడీఓ శశికళకు వినతిపత్రం అందజేశారు. ఇందులో ఉప సర్పంచు, వార్డు సభ్యులు నరేంద్ర, శ్రీధర్, తిరుపతి, బాబు పాల్గొన్నారు.

కేసీ నారాయణకు ఘన నివాళి



విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది

గుంతకల్లు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జడ్పీ మాజీ ఛైర్మన్, టీడీపీ మాజీ నాయకుడు కేసీ నారాయణ 86వ జయంతి వేడుకలను ఎస్ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలోని కేసీ నారాయణ విగ్రహానికి పూలమాలలను వేసిన కళాశాల పాలకవర్గం, అధ్యాపకులు, సిబ్బంది నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల పాలక సభ్యులు ఆర్కే నాయుడు, డైరెక్టర్ పీ గోపాల్, ప్రిన్సిపాల్ ఆర్ సురేశ్ బాబు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కజొన్నకు కత్తెర పురుగు

ఉరవకొండ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంటకు కత్తెర పురుగుల నివారణకు 250 గ్రాముల ఇమామెక్టిన్ బెంజోయేట్‌ను 150 లీటర్ల నీటితో కలిపి ఎకరాకు పిచికారి చేయాలని ఏఓ రామకృష్ణ సూచించారు. రాయంపల్లిలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కత్తెర పురుగు మొక్క జొన్న సుడిలోకి పోయి, పత్రాన్ని మొత్తం తినడం వల్ల మొక్క పెరుగుదల ఆగిపోతుందన్నారు.

క్రైం న్యూస్..

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాడిపత్రి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాంపల్లి గ్రామానికి చెందిన వెంకటనారాయణ (27) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. ఆయన ఈనెల 16న పొలం నుంచి వర్షంలో బైక్ తిరిగి వస్తూ.. అదుపు తప్పి కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతను.. కోలుకోలేక మరణించాడు. అతనికి భార్య హుస్సేనమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

మరో యువకుడు...



ధనుంజయ (ఫైల్)

కూడేరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని జల్లిపల్లి గ్రామ వాసి ధనుంజయ (31) అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. ఆదివారం ఉదయం ఆ గ్రామంలో వర్షానికి దెబ్బ తిన్న ఓ గోడ కూలి పక్కనే ఉన్న ధనుంజయపై పడింది. దీంతో తీవ్రంగా గాయపడ్డ అతన్ని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కోలుకోలేక అతను బుధవారం మరణించాడని సీఐ రాజు తెలిపారు. ధనుంజయకు భార్య చంద్రకళ, కూతురు లావణ్య ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగివైరు చోరీ



ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

శెట్టూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగంపల్లి రైతు చాకలి పాతన్నకు సంబంధించిన వ్యవసాయ తోటలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం రాత్రి దుండగులు ధ్వంసం చేసి.. అందులోని రాగి వైర్‌ను ఎత్తుకెళ్లారు. ఏడు ఎకరాల్లో మొక్కజొన్న, మామిడి, వక్క పంటలు సాగు చేస్తున్నానని, ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేయడంతో విద్యుత్ లేక పంటకు నీరు అందించలేకపోతున్నానని బాధిత రైతు వాపోయాడు. వైర్లు చోరీ చేస్తున్న దుండగులను పోలీసులు పట్టుకుని కఠినంగా శిక్షించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగాలివ్వాలి

రైతులు, గ్రామస్థుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వసంతబాబు

డీ.హీరేహాళ్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తగా ఏర్పాటు చేసే పరిశ్రమల్లో 50 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. మండలంలోని డీ.హీరేహాళ్, హిర్దేహాళ్ గ్రామాల మధ్య హరి ఓం పైప్ ఇండస్ట్రీని ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని ఆర్డీఓ వసంతబాబు బుధవారం నిర్వహించారు. ఇందులో ఇరు గ్రామాల రైతులు, ప్రజలు మాట్లాడారు. ఫ్యాక్టరీల నుంచి వచ్చే వ్యర్థాలతో గ్రామస్థులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పరిశ్రమల ద్వారా కాలుష్యం రాకుండా చర్యలు చేపట్టాలని, ప్రతి ఎకరాకూ రూ. 20 వేలు చొప్పున నష్టపరిహారం అందించాలని, గ్రామాల్లో ప్రతి నెలా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నందు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిషోర్‌రెడ్డి, కాలుష్య నియంత్రణ జోనల్ అధికారి రాజశేఖర్, సీఐ వెంకటరమణ, తహసీల్దార్ శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.

మైనార్టీ నాయకులకు డీసీసీ పదవులు



డీసీసీ అధ్యక్షుడితో కాంగ్రెస్ పట్టణ నాయకులు

గుంతకల్లు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ముగ్గురు కాంగ్రెస్ మైనార్టీ నాయకులకు డీసీసీ పదవులు దక్కాయి. బుధవారం అనంతపురానికి వెళ్లిన గుంతకల్లు నాయకులు డీసీసీ అధ్యక్షుడు వై మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఇమాం నుంచి నియామక ఉత్తర్వులను అందుకున్నారు. పట్టణానికి చెందిన ఎస్ ఆలం నవాజ్, ఎం ఫిరోజ్ అలీఖాన్‌కు జిల్లా ఉపాధ్యక్షులుగా, పీ నబీ రసూల్‌ను కార్యదర్శిగా నియమిస్తూ.. ఉత్తర్వులను అందజేశారు. పదవులను పొందినవారు పార్టీ బలోపేతానికి కృషిచేయాలని డీసీసీ అధ్యక్షుడు సూచించారు. పదవులను కేటాయించిన అధిష్ఠానానికి, డీసీసీ అధ్యక్షుడికి ఆలం నవాజ్, ఫిరోజ్ అలీఖాన్, నబీరసూల్ ధన్యవాదాలు తెలిపారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ

విడపనకల్లు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మలేరియా వ్యాధిపై అవగా హన ర్యాలీని బుధవారం నిర్వహించారు. ఇందులో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పుష్పా, ముస్రద్ జాహ, వైద్య సిబ్బంది చిన్నకంబయ్య, హెల్త్ అసిస్టెంట్ నూర్ మహమ్మద్, స్టాఫ్ నర్సు యోగాలక్ష్మి, ఫార్మసిస్ట్ సరళా, ల్యాబ్ టెక్నిషియన్ నూర్ పాల్గొన్నారు.

● రాయదుర్గంరూరల్: ప్రపంచ దోమల నివారణ దినం సందర్భంగా స్థానిక చంద్రబాబునాయుడు కాలనీలో అవగాహన ర్యాలీ నిర్వ హించారు. ఇందులో అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు యశ్వంత్‌కుమార్, హజార్‌ఖాన్, మలేరియా సూపర్‌వైజర్స్ ఆర్ ఎర్రిస్వామి, సూర్యనారాయణ, వార్డు హెల్త్ సెక్రెటరీ విజయలక్ష్మి, సరోజ, సునీత, ప్రమీల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ పాలనపై కాంగ్రెస్ నిరసన

కళ్యాణదుర్గంరూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా పాలన సాగిస్తోందని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. ఆ పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం తొత్తుగా మారిందని ధ్వజమెత్తారు. ఈ మేరకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో ఓట్ల దొంగ గద్దె దిగు అనే నినాదంతో కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఇందులో కాంగ్రెస్ నాయకులు మాల యర్రిస్వామి, ఎం తిమ్మప్ప పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు